నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
మంగళవారం | 28 జనవరి 2025 | www.navatelangana.com

రాష్ట్ర మహాసభలకు అద్భుత ఏర్పాట్లు



- రుచికరమైన ఆహారం అందించిన ఫుడ్ కమిటీ
- ఉక్కు క్రమశిక్షణతో వాలంటీర్స్ సేవలు
- వసతులు, ట్రాన్స్‌ఫోర్డ్ ఇతర సదుపాయాలు
- ఉత్తేజాన్ని నింపేలా మహాసభల ప్రాంగణం
- మెడికల్ క్యాంప్, బుక్‌హౌస్, మీడియా పాయింట్...
- ఎర్రజెండా సాంగ్స్...చిందేసిన కామ్రేడ్స్...అబ్బుర పర్చిన కళా ప్రదర్శన
- ఆహ్వాన సంఘం కృషి అభినందనీయం

సీతారాం ఏచూరి నగర్ నుంచి మేకల కృష్ణయ్య

సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు అత్యంత జయప్రదంగా సాగుతున్నాయి. ఆహ్వాన సంఘం అద్భుతమైన ఏర్పాట్లు చేసింది. చిన్నపాటి ఉద్యమమే అయినా సంగారెడ్డి పార్టీ శక్తికిమించి మహాసభల్ని నడుపుతూ పార్టీ నాయకత్వం, ప్రతినిధుల నోట సూపర్ అనిపించుకుంది. రెండు నెలల పాటు మహాసభల పనుల్లో నిమగ్నమైన పార్టీ శ్రేణులు నాలుగు రోజులుగా జరుగుతున్న మహాసభల్లోనూ కంటికి కునుకులేండా కష్టపడి పనిచేస్తున్నాయి. నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తీసుకున్న బాధ్యతల్ని తూచా తప్పకుండా నిర్వర్తిసున్నారు. మహాసభలకు వచ్చిన జాతీయ, రాష్ట్ర నాయకులు, 33 జిల్లాలు, వివిద రంగాల నుంచి వచ్చిన ప్రతినిధులు, పరిశీలకులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. ముఖ్యంగా అత్యంత రుచికరమైన ఆహార పదార్థాలు పెడుతున్నారు. వాలంటీర్స్ అప్పజెప్పిన పనుల్ని ఉక్కు క్రమశిక్షణతో చేస్తున్నారు. వసతులు, ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాల్లోనూ ఏ లోటూ రాకుండా చూస్తున్నారు. మహాసభల ప్రాంగణం, ప్రతినిధుల హాల్, పట్టణంలో ప్రచారం విషయంలోనూ చాలా అద్భుతమైన డెకరేషన్ చేశారు. కార్మిక వర్గం ఆత్మీయ ఆతిథ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ షబాష్ అంటున్నారు.

ఆహ్వాన సంఘం కృషి అభినందనీయం

మహాసభలను జయప్రదంగా నిర్వహించడంలో ఆహ్వాన సంఘం కృషిని అందరూ మెచ్చుకున్నారు. చైర్మన్‌గా చుక్క రాములు, వైస్ చైర్మన్‌గా జే.మల్లిఖార్జున్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి జయరాజు పర్యవేక్షణలో మహాసభల జనులన్నీ జయప్రదంగా సాగాయి. రాష్ట్ర కేంద్రం మార్గదర్శకంగా ఆహ్వాన సంఘం అవసరమైన ఏర్పాట్లన చేసి సక్సస్ అయ్యిందనే అభిప్రాయం వ్యక్తమైంది. మాస్ క్యాంపెయిన్ చేసి ఫండ్స్ సేకరించడం నుంచి మహాసభల్ని నడపడం వరకు అన్ని విషయాల్లోనూ ఆహ్వాన సంఘం కృషి చాలా బాగుందని నాయకత్వమే కాదు ప్రతినిధులందరూ మెచ్చుకునేలా ఉంది.

మెడికల్ క్యాంప్...పుస్తక ప్రదర్శన...సోషల్ మీడియా

ప్రతినిధులు, నాయకులకు వైద్య పరమైన సేవలందించేందుకు మహాసభల ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అనారోగ్య సమస్యలు తలెత్తిన వారికి వెంటనే వైద్యం అందించారు. గోలీలు ఉచితంగా అందజేశారు. బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అదే విధంగా నవతెలంగాణ బుక్ హౌస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బుక్‌స్టాల్స్ ఏర్పాటు చేశారు. కృష్ణారెడ్డి ఇతర సిబ్బంది బుక్‌సేల్స్‌ను చూశారు. ప్రతినిధులతో పాటు సంగారెడ్డి జర్నలిస్టులు సైతం సాహిత్యాన్ని కొనుగోలు చేశారు. మహాసభలు జరుగుతున్న తీరు, నాయకుల ప్రసంగాలు, ప్రత్యేకతలు, చర్చలుకు సంబంధించిన పోటోలు, వీడియోలను తీసి ఎప్పటికప్పుడు వివిద గ్రూపుల్లో షేర్ చేయడం, అందమైన పోస్టర్స్ తయారు చేయడంలో సోషల్ మీడియా కృషి బాగుంది.

ఉక్కు క్రమశిక్షణతో వాలంటీర్స్ సేవలు





మహాసభలకు సంబంధించిన పనుల్లో వాలంటీర్స్ సేవలు కీలకమైనవిగా నిలిచాయి. ముఖ్యంగా కిచెన్‌లో 120 మంది పారిశ్రామిక కార్మికులు ఆహార పదార్థాలు వడ్డించడం, అందించడంలో మంచి కృషి చేశారు. అదే విధంగా వసతులు, ప్రతినిధుల స్టేజీ, హాల్స్, ప్రాంగణం ప్రధాన గేట్ వద్ద, ట్రాన్స్‌పోర్ట్, మీడియా, లైటింగ్, మైక్, సెట్, అలంకరణ, వాటర్ సరఫరా, పారిశుద్ధ్యం, వీఐపీల వద్ద వివిద రకాల పనులు చేసే విషయంగా వాలంటీర్స్ కృషి అభినందనీయమని అందరూ మెచ్చుకున్నారు. వాలంటీర్స్ కమిటీ బాద్యులుగా కె.రాజయ్య పర్యవేక్షణలో వాలంటీర్స్ శబాష్ అనిపించేలా పనిచేశారు. మహాసభలకు హాజరైన ప్రతినిధులు, పరిశీలకులు, జాతీయ, రాష్ట్ర నాయకత్వం ఎవరైనా సరే ట్యాగ్ లేనిదే లోపలికి అనుమతించలేదు. ప్రతినిధుల హాల్ వద్ద ఉన్న వాలంటీర్స్, ప్రధాన గేట్ వద్ద ఉన్న వాళ్లు సైతం కాంప్రమైజ్ కాకుండా నడుచుకున్నారు. పొద్దున ఆరు గంటలకు ముందే లేచి రాత్రి ఒంటి గంట వరకు వివిద విభాగాల వాలంటీర్స్ సేవలందించారు.

ఆహా ఏమి రుచి...





మహాసభలకు వచ్చిన ప్రతి నిధులు, నాయకులకు "ఆహా ఏమి రుచి... అదరా మైమరచి" అన్నట్లుగా అందరూ మెచ్చుకోదగిన రీతిలో ఆహార పదార్థాలను అందించారు. అందు కోసం ఫుడ్ కమిటీ ఎంతో కష్టపడింది. నాయకులు, ప్రతినిధులకు మూడు రోజులుగా అత్యంత రుచికరమైన వరైటీ ఫుడ్స్ అందిస్తున్నారు. వెజ్, నాన్‌వెజ్ వంటలతో అదరగొట్టారు. టిఫిన్, టీ, స్నాక్స్, చికెన్, మటన్ బిర్యానీ, కూరగాయలతో రుచికరమైన కూరలు, సాంబర్, పెరుగు, రెండు మూడు రకాల స్వీట్స్, ఫ్రూట్ సలాట్, పాన్, వాటర్ ఇలా తినలేనంతగా వంటలు చేసి పెడుతున్నారు. ఫుడ్ కమిటీ ఇంచార్జీగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.సాయిలు బాధ్యతలు చూశారు. టిఫిన్, భోజనాలు, స్నాక్స్, టీ సరఫరా చేసే విషయంలో చాలా క్రమశిక్షణతో చేశారు. పాండురంగారెడ్డి, బాగారెడ్డి పర్యవేక్షణలో కిచెన్ పనులన్నీ చక్కబెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన నాయకులకు రుచి, శుచితో కూడిన ఆహార పదార్థాలను ఎంపిక చేయడం, వంటలు చేయించడం, సమయానికి వడ్డించడం కోసం శ్రీనివాస్ ఎంతో కష్టపడ్డారు. రాత్రింబవళ్లు వంటల విషయంలో ప్రత్యేక నిపుణుల చేత వండిన వంటల్ని రుచి చూసి అందరికీ నచ్చేలా చేయించడం కోసం ఎంతో కష్టపడ్డారు. శాండ్విక్, సీటీల్, తోషిబా ఇతర పరిశ్రమలకు చెందిన కార్మికులు అత్యంత క్రమశిక్షణతో కిచెన్‌హాల్‌లో సరఫరా పనులు చేశారు.

లాల్ జెండా సాంగ్స్ జోష్... స్టెప్పేసిన కామ్రేడ్స్



మహాసభల్లో భాగంగా సోమవారం భోజన విరామ సమయంలో అమరుల స్థూపం ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఎర్రజెండా పాటలతో మారుమోగింది. ఎర్రజెండా పాటలకు పార్టీ నాయకులు, ప్రతినిధులు, వాలంటీర్స్ ఒక్కరేమిటీ అక్కడున్న వాళ్లంతా అడిపాడారు. రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు ఎస్.వీరయ్య, జాన్‌వెస్లీ, చుక్క రాములు, మల్లు లక్ష్మి , టి.సాగర్, పాలడుగు బాస్కర్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అందరూ ఎర్రజెండా సాంగ్స్ జోష్‌లో స్టెప్ వేసి జోష్ తెచ్చారు. ఎర్రజెండా పాటలకు ఆడిపాడడంతో ప్రాంగణమంతా ఒక్కసారిగా ధూంధాం వేదికగా మారింది.

రాజీపడ కుండా వసతులు





జాతీయ నాయకత్వం ప్రకాశ్‌కరత్, బీవీ.రాఘవులు, విజయరాఘవన్, పుణ్యవతి, హేమలతా, అరుణ్‌కుమార్, మమతా, కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, సాయిబాబు, చెరుపల్లి సీతారాములు, జిన.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, రాష్ట్ర కమిటీ సభ్యులు, 33 జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు, పరిశీలకులు, రంగాల వారి బాధ్యులకు వేర్వేరుగా వసతుల్ని ఏర్పాటు చేశారు. 18 చోట్ల హోటళ్లు, లాడ్జీలు, పంక్షన్‌హల్స్, ఆఫీస్‌లు, గెస్ట్‌హౌస్‌ల్లో వసతి ఏర్పాటు చేశారు. వసతుల కమిటీ బాధ్యులుగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం పర్యవేక్షణలో బాధ్యులు, వాలంటీర్లు కృషి చేశారు. ముఖ్యంగా వాటర్, టాయిలెట్స్, పారిశుద్ధ్యం విషయంలో ఏలాంటి ఇబ్బందుల్లేకుండా చూశారని ప్రతినిధులు, నాయకులు మెచ్చుకునేలా ప్రయత్నించారు. ట్రాన్స్‌పోర్టు కూడా సకాలంలో తీసుకెళ్లడం, తీసుకురావడం కోసం కృషి చేశారు.

అలంకరణ అదుర్స్



సీతారాం ఏచూరి నగర్‌లోని మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో జరుగుతున్న మహాసభల సందర్భంగా పట్టణంలో వివిద రూపాల్లో అలంకరణ చేశారు. ముఖ్యంగా ప్రతినిధుల హాల్, స్టేజి, ప్రాంగణం ఎర్రటి ఆర్చీలు, తోరణాలు, జెండాలు, హోర్డింగ్స్‌తో పాటు ప్రధాన గేట్ నుంచి ఎర్రగుడ్డతో ప్రతినిదుల హాల్ వరకు స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. మార్క్సిస్ట్ పార్టీ మహనీయుల పోటోలతో కూడి కటౌట్స్ పెట్టారు. మీడియా పాయింట్, ప్రతినిధుల చర్చల కోసం, మెడికల్ క్యాంపు, నవతెలంగాణ బుక్ హౌస్, సోషల్ మీడియా, కళా ప్రదర్శనల డయాస్, అమరుల స్థూపం వంటి మహాసభల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డెకరేషన్ కమిటీ ఇంచార్జీగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ పర్యవేక్షణలో కమిటీ అద్భుత ఏర్పాటు చేసింది. గోకుల్ గార్డెన్ అంతటా విరబూసిన ఎర్రమందారం మాదిరి ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దడంతో మహాసభలకు ప్రాంగణమంతా కళాతోరణంగా కనిపిస్తుంది. అలంకరణ కమిటీ సభ్యుల కృషిని నాయకులు, ప్రతినిధులు అభినందారు.





















































నవతెలంగాణ 2
సమగ్ర తెలుగు దినపత్రిక
సంగారెడ్డి
మంగళవారం | 28 జనవరి 2025 | www.navatelangana.com

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

నవతెలంగాణ-కల్హేర్



అనారోగ్యాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతున్నదని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నిజాం పేట మండలంలోని రామ్‌రెడ్డిపేట గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ దుర్గమ్మ తనయులు పి.భూమయ్యకు ఆసుపత్రి ఖర్చుల కోసం మంజూరైన రూ.200000 ఎల్ఓసీని ఖేడ్ పట్టణం లోనే తన నివాస గృహంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యాలకు గురైన నిరుపేదలకు వైద్య ఖర్చులు భారం కాకుండా సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తున్నద న్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ చౌహా న్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిశ్రీకాంత్,శ్రీహరి, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన జోగిపేట ఆర్యవైశ్య సంఘం పాలకవర్గ సభ్యులు

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు రంగ సురేష్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సోమవారం సంగారెడ్డి లోని మంత్రి నివాసానికి వెళ్లి ఆయనను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి సహకరించాలని పాలకవర్గం సభ్యులు మంత్రిని కోరారు. ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులుగా రంగా సురేష్, ఉపాధ్యక్షులుగా రంగా హరి ప్రసాద్, చీకోటి శంకర్, కొత్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిలు గా వరప్రసాద్, మురళీధర్, కోశాధికారి గజవాడ రాజు, సహాయ కార్యదర్శి లు గా నరేష్, సంపత్ కుమార్, ధర్మరాజు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జోగుపేట కౌన్సిలర్ ఎస్. సురేందర్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పట్లోళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు మైనార్టీ గురుకులంలో ప్రవేశాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



తెలంగాణ మైనారిటీ గురుకులం పటాన్‌చెరు బాలికలు-1 పాఠశాలలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను మైనారిటీ విద్యార్థులకు 5వ తరగతి నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం(ఎంపీసీ, బైపీసీ) (గ్రూప్‌లు మాత్రమే) వరకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి ఓ ప్రకటనలో తెలిపారు. మైనార్టీ గురుకులంలో ఉచిత నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పుస్తకాలు, దుస్తులు, స్టేషనరీ, హాస్టల్ సదుపా యం అంది స్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు కంప్యూటర్ రోబోటిక్స్ ఆస్ట్రానమీ వివిధ కళల్లో ఉచిత శిక్షణ అందిస్తు న్నట్టు చెప్పారు. 5వ తరగతిలో- 80, 6వ తరగతి లో-28,7వ తరగతిలో- 22, 8వ తరగతిలో- 17,ఇంటర్ మొదటి సంవత్సరం-80 (ఎంపీసీ40, బైపీసీ 40) అడ్మిషన్ల కోసం http://WWW.tmreis.telangana.gov.in వెబ్‌సైట్ లేదా పటాన్ చెరు బాలికలు-1 పాఠశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చేనెల 28 చివరి తేదీ అని.. ఇతర వివరాలకు 7995057882, 8106721827ను సంప్రదించాలన్నారు.

పట్టా భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కొండాపూర్

తమ పట్టా భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని.. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరతూ ముందేనిపల్లి గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు అర్సగొల్ల లక్ష్మి, ఎర్నోళ్ల ఎల్లమ్మ సాయి లక్ష్మమ్మ, నర్సగోల్ల కృష్ణ మాట్లాడుతూ.. గ్రామ శివారులోని సర్వేనెంబర్ 60లో తమ పేరుపై 13 గుంటల పట్టా భూమి ఉన్నదన్నారు. అయితే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆనంద్ కుమార్ రెడ్డి, రాములు, కళ్యాణ్ కలిసి తమ భూమిపై కన్నేసి అన్యాయంగా కబ్జా చేశారన్నారు. బెదిరింపులకు పాల్పడుతూ.. భూమి చుట్టు ప్రహరీ నిర్మించి, ఇంటి నిర్మాణాన్ని చేపట్టారన్నారు. నాలా పర్మిషన్ లేకుండా, ఇష్టానుసారంగా నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఎందుకు కబ్జా చేశావని ప్రశ్నిస్తే.. బెదిరింపులకు పాల్పడుతూ భౌతిక దాడులకు గురి చేస్తున్నాడన్నారు. ఈ విషయంలో న్యాయం చేయాలని పోలీసులను సంప్రదిస్తే సీఐ, ఎస్సై, తహసీల్దార్‌లు సైతం వారికే వంత పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుని.. తమ భూమిని తమకు అందజేయాలని ఫిర్యాదులో పేర్కొనట్టు చెప్పారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

నవతెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలోని తొగర్‌పల్లి గ్రామానికి చెందిన సందగళ్ళ ప్రకాష్‌కి, గుడ్డి సుధాకర్‌కి ఇద్దరికీ కలిపి రూ.51,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు విట్టల్, పార్టీ జనరల్ సెక్రెటరీ గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పాండు రంగం, మాజీ సర్పంచ్ రుక్మొద్దీన్, మాజీ ఎంపీటీసీ సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బస్వరాజ్ పాటిల్‌ను పరామర్శించిన నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్, న్యాల్కల్

న్యాల్‌కల్ మండల సీనియర్ నాయకులు బస్వరాజ్ పాటిల్ మాతృమూర్తి కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. ఈ విషయం తెల్సుకున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం సోమవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు వై.తరుణ్, మాజీ ఉపసర్పంచ్ బాల్‌రాజ్, బస్వరాజ్‌హల్లి,చెంగల్ జైపాల్,భూమయ్య,దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బాచేపల్లిలో మమత హాస్పిటల్ వారి ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కల్హేర్



నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి గ్రామంలో మమత హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చింది.ఈ వైద్య శిబిరంలో గ్రామస్తులు పాల్గొని వారికి కావాల్సిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మమత హాస్పిటల్ వారు వైద్య పరీక్షలు అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మమత హాస్పిటల్ యాజమాన్యానికి గ్రామ ప్రజల తరపునపంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



ప్రవీణ్‌చారి | సాయికిరణ్‌రెడ్డి

నవతెలంగాణ-మనూర్, న్యాల్కల్

కొత్తగా పట్టా పాసుబుక్కు వచ్చిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని నాగలిగిద్దా మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ చారి, న్యాల్కల్ మండలంలోని చాల్కి ఏఈఓ సాయికిరణ్ రెడ్డి తెలిపారు. ఈనెల ఒకటి తరువాత పట్టా చేసుకున్న రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్ బ్యాంకు అకౌంట్ జిరాక్స్ పత్రాలను సంబంధిత ఏఈఓ లకు ఇవ్వాలన్నారు. గతంలో పెట్టుబడి సాయం పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవద్దన్నారు. కానీ బ్యాంకు అకౌంట్ నంబర్ ఏదైనా మార్పు కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ నెల 31లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు.

10వ తరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేత

నవతెలంగాణ-సంగారెడ్డి



మండలంలోని కల్బగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఆ విద్యార్థుల కోసం గ్రామ మాజీ ఉపసర్పంచ్ అజయ్‌కుమార్ అల్పాహారంగా సోమవారం పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10వ తరగతి ఫైనల్ పరీక్ష వరకు విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం స్వచ్ఛందగా అందజేస్తాన న్నారు. విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణత సాధించి తల్లిదం డ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ రావడం గర్వకారణం

నవతెలంగాణ-కొండాపూర్

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం దళిత జాతికి గర్వకారణమని సంగారెడ్డి నియోజకవర్గ కందుకూరి అనూష కృష్ణ అన్నారు. మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాట యోధుడని.. అణగారిన వర్గాల పక్షాన వారి హక్కుల కొరకు పోరాడిన ధీరుడని కొనియాడారు. సుమారు 30ఏండ్ల పాటు ప్రజా క్షేమం కోసమే తన పోరాటాలు కొనసాగించారన్నారు. అటువంటి నిస్వార్థ దళిత నాయకుడికి పద్మశ్రీ రావడం చాలా సంతోషకరమన్నారు.

బీరప్ప జాతరలో పాల్గొన్న నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని రంజోల్‌లో జరుగుతున్న బీరప్ప జాతరకు బీజేపీ రాష్ట్ర నాయకులు నాగొల్ల భాస్కర్ సోమ వారం హాజరయ్యారు. ఆయనతో పాటు బీజేపీ పట్టణ అధ్యక్షులు పూల సంతోష్, పట్టణ2 అధ్యక్షులు రమేష్‌రెడ్డి, పీజీ నారాయణ రాజా రమేష్ తదితరులు ఉన్నారు.

మునిపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- మక్తగ్యాసారం టు సింగూర్ బోటింగ్ ఏర్పాటుకు కృషి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర
- మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన



నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ అన్నారు. సోమవారం మండలంలో మంత్రి సుడగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మండలంలోని బుసరెడ్డి పల్లి గ్రామ శివారులో గల తెలంగాణ హరిత రెస్టారెంట్ వద్ద పర్యాటక కేంద్రంగా తీర్చి ద్దిదేందుకు కావాల్సిన నిధులు మంజూ రు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మండ లంలోని మల్లికార్జునపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలను మంత్రి ఆకస్మికంగా సందర్శించగా.. పాఠశాలలో చదువుకుం టున్న విద్యార్థులు పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి.. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు పాఠశాల అభివృద్ధికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని విద్యార్థులకు భరోసాలు ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే తీరును శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచిం చారు. అనంతరం మండలంలోని మక్తక్యసరం గ్రామంలోని సింగూర్ బ్యాక్ వాటర్ నుంచి సింగూర్ ప్రాజెక్టు వరకు నూతనంగా బోటింగ్ ఏర్పాటు చేసేందుకు సంబంధిత అధికారులతో చర్చలు జరిపారు. అంతకుముందు మండల ంలోని భూసారెడ్డిపల్లి గ్రామానికి మంత్రి తొలిసారి రావడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కార్పొరేట్స్‌కు ధీటుగా ఖాజిపల్లి పాఠశాల

- ఆధునిక సౌకర్యాలు.. అధునాతన భవనం
- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- కెమ్ టెక్ కెమికల్స్ సహకారంతో నిర్మించిన పాఠశాల భవనం ప్రారంభం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ఖాజిపల్లి గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కార్పొరేట్స్‌కు ధీటుగా నిలుస్తున్నదని.. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఖాజిపల్లి గ్రామంలో కెమ్ టెక్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో కోటి తొమ్మిది లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యాధునిక వసతులతో పాఠశాల నిర్మించడం పట్ల పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిశ్రమల గ్రామాల పరిధిలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని కోరారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి నూతనంగా నిర్మించిన పాఠశాలలో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు గ్రామ ప్రముఖులు బాధ్యతతో కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పి మాజీ వైస్ చైర్మెన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, నరసింహ, మాజీ ఎంపీటీసీ భార్గవ్, పరిశ్రమ ఎండి గుల్లపల్లి గోపికృష్ణ, సంస్థ హెచ్ఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షతపై అవగాహనా కార్యక్రమం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నారాయణఖేడ్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, కళాశాల(బాలురు)లో లింగ వివక్షత అనే అంశంపై సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సును ఎస్ఐ ఉద్దేశించి మాట్లాడుతూ.. బాలల హక్కులు, చట్టాలు, పోక్సో, నిర్భయ చట్టం, హెల్ప్ లైన్ నంబర్స్ 100,101,108,1098 గురించి, సైబర్ నేరాలు, మద్యపానం, ధూమపానం వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. చదువుతోపాటు బాలురకు అన్ని రంగాల్లో అభివృద్ధి అవసరమన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త పల్లవి మాట్లాడు తూ.. లింగ సమానత్వం, బాలురు క్రమశిక్షణ, తోటివారితో ఎలా మసులుకోవాలో, మహిళలు, ఆడ పిల్లలను ఎలా గౌరవించలో వివరించారు. బాలురు ఉన్నత చదువులు చదివి సమాజంలో ఉన్నతమైన వ్యక్తిత్వం గల వ్యక్తులుగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధనాచార్యులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ జమున, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఫైనాన్సియల్ స్పెషలిస్ట్ పినర్సింలు, ఉపా ధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ పెన్షన్స్ స్కీమ్‌ను రద్దు చేయాలి

నవతెలంగాణ-జోగిపేట



యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆందోల్ మండల పీఆర్టీయూ అధ్యక్షులు ఎస్.నరోత్తం కుమార్ అన్నారు. యునైటెడ్ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా అందోలు మండల పీఆర్టీయూ అర్బన్, రూరల్ శాఖల ఆధ్వర్యంలో తహసీల్దార్ విష్ణు సాగర్‌కు సోమ వారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంను వ్యతిరేకిస్తూ సీపీఎస్ ఉద్యోగులందరికీ ఓపిఎస్(ఓల్డ్‌పెన్షన్ స్కీమ్) ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, యూపీఎస్‌లను రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ ఓల్డ్ పెన్షన్ స్కీం అమలయ్యే వరకు పోరాటం ఆగదని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే చట్టాలు సంస్కరణలు తీసుకొస్తే పోరాటం మరింత ఉధృతం చేస్తామన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని తీసుకొస్తున్నట్టు గెజిట్ ప్రకటించి మరింత నష్టాన్ని చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకి స్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ అందోలు మండల అర్బన్, రూరల్ కార్యదర్శి, జనార్ధన్ గౌడ్, రాజమల్లు, మయా చారి రాష్ట్ర బాధ్యులు మంజ్యా నాయక్, అనిల్ కుమార్,మహేష్ చారి జిల్లా బాధ్యులు సుభాష్, విబి.శ్రీనివాస్ మండల బాధ్యులు వీరేశం, సర్దార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాత పంటల్లోనే పోషక విలువలు



నవతెలంగాణ-జహీరాబాద్

పాత పంటల్లోనే అనేక పోషక విలువలు ఉన్నాయని కేవీకే డీడీఎస్ శాస్త్రవేత్త శైలజ అన్నారు. మొగుడంపల్లి మండలంలోని జాడి మల్కాపూర్‌లో సోమవారం జరిగిన పాత పంటల జాతరను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు గిరిజనులు అత్యంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం వారు తీసుకుంటున్న పోషక లవణాలతో కూడిన పాతపంటల ఆహార పదార్థాలేనన్నారు.కాగా గ్రామస్తులు భాజాబజంత్రీ లతో పాత పంటల జాతరకు ఘనంగా స్వాగతం పలికా రు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గోపాల్, లక్ష్మన్న, చంద్ర న్న, టీడీఎస్ సంఘం సభ్యులు మాణిక్యం, చంద్రమ్మ, పూల మ్మ, అడివమ్మా శాంతమ్మ వినయ్‌కుమార్‌తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

నవతెలంగాణ-సదాశివపేట



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా 01-4-2023 నుంచి 31-03-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు గాను ఈనెల 16 నుంచి 26 వరకు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన విషయం విధితమే. కాగా ఆ తనిఖీలకు సంబంధించి సోమవారం ప్రజా వేదికలో నిర్వహించారు. కాగా సంవత్సరం కాలంలో మండలంలోని 29 గ్రామాల్లో జరిగిన 421 పనులకు గాను 6.56 కోట్లు ఖర్చు చేయగా అందులో 6.46 కోట్లు కూలీల రూపంలో ఖర్చు.. అలాగే రూ.10 లక్షల సామాగ్రి కొరకు ఖర్చు చేసినట్లు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో రికార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో లేనట్టుగా గుర్తించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ బాలరాజు, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీడీవో లక్ష్మి, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది, అదేవిధంగా తనిఖీ బృందం పాల్గొన్నారు.

వృత్తి వ్యాపార లైసెన్సులు విధిగా తీసుకోవాలి

నవతెలంగాణ-జోగిపేట



ఆందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని ప్రజలు, వ్యాపారస్తులు వ్యాపార లైసెనులు విధిగా తీసుకోవాలని అందోల్ జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి వృత్తి వ్యాపార లైసెన్స్ తీసుకొని వారు వెంటనే తీసుకోవాలన్నారు. గతంలో తీసు కున్న వృత్తి వ్యాపార లైసెన్స్ రెన్యువల్ చేసుకొ నుటకు గడువు ముగిస్తున్నందున వెంటనే షాపు లైసెన్సు రెన్యువల్ చేసుకొని అపరాధ రుసుం పడకుండా చూసుకోవాలన్నారు. పురపాలక సంఘ ము టాస్క్ ఫోర్సు టీం వృత్తి వ్యాపార లైసెన్సులపై ఆకస్మిక తనిఖీల్లో.. లైసెన్సు లేనియెడల పురపాలక చట్టం-2019 ప్రకా రం చర్యలు తీసుకోని, భారీ జరిమానాలు విధిస్తామన్నారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



విద్యార్థులతో పని చేయిస్తున్నారనే నెపంతో సంగారెడ్డి ఎంపీపీ ఎస్, ఏపీహెచ్‌బీ కాలనీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సిహెచ్.నాగమణి, జి.మంజుల, ఎం.శారదలను ప్రాథమిక విచారణ లేకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని.. ఆ ఉపాధ్యాయులను వెంటనే సర్వీసులోకి తీసుకోవాలని, వారిపై వేసిన వేటును ఎత్తివేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి సోమవారం వినతి పత్రం అందజేశారు. జెండా వందనం ముందు రోజు పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి శుభ్రం చేసుకునే ప్రక్రియలో భాగంగా అది జరిగిందని, ఉపాధ్యాయులు వారి ఉద్దేశపూర్వకంగా విద్యార్థులతో పని చేయించలేదన్నారు. అన్యాయంగా సస్పెండ్ చేసిన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. దానికి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ పరిశీలిస్తామన్నారు. అనంతరం సంఘాల నాయకులు మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఉన్నదని.. పిల్లలకు నష్టం జరగకుండా ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఈ అన్యాయాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక నాయకులు పీఆర్టీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.మాణయ్య, ఎ.ప్రభు, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస్ రాథోడ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, సాయిలు, టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం. సోమశేఖర్, ఎ.రాంచందర్, టీపీయూఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివ ప్ప, ఎస్సీ ఎస్టీ సంఘ అధ్యక్షులు దుర్గయ్య, టీఎస్ జీహెచ్ ఎంఏ రాష్ట్ర కోశాధికారి తుకారాం, జీటీఏ అధ్యక్షులు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘం నూతనంగా క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా, పట్టణ పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజ్ కుమార్‌లు సంఘం భవనంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మీలో ఒకడిగా మీతో ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెలే అన్నారు. తన గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలి పారు. దేశంలో ప్రత్యేకమైన, గొప్ప వృత్తి నైపుణ్యాన్ని కలిగిన ఘనత కేవలం పద్మశాలీకే ఉందన్నారు. ఐక్యమత్యంగా అన్ని కార్యక్రమాలు విజయవంతం చేయడానికి తనవంతుగా పూర్తి మద్దతు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి సంఘం యువజన అధ్యక్షులు గందిమల్లె రాజు, రాష్ట్ర పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీత వైద్యం కిషోర్, పద్మశాలి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లేశం, ప ద్మశాలి సంఘం అసోసియేట్ అధ్యక్షులు జనార్ధన్, జిల్లా ప ద్మశాలి సంఘంఉపాధ్యక్షులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి భవన పరిశీలన

నవతెలంగాణ-చౌటకూర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త మండలముగా ఏర్పడిన చౌటకూర్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఒకటే కొనసాగుతూ వచ్చింది. మిగతా ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఉమ్మడి పుల్కల్ మండలంలోనే కొనసాగుతున్నాయి. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి అనుమతులు జారీ చేసింది. కానీ కార్యాలయాలు కట్టకపోవడంతో మండల కేంద్రంలో ప్రస్తుతానికి పాత ప్రభుత్వ భవనాలు అందుబా టులో ఉండటంతో ఎంపీడీవో ఆనంద్ మేరీ ఆ భవనాలను సోమవారం పరిశీలించింది. ప్రస్తుతానికి ఈ భవనాలు బాగానే ఉన్నాయని.. గురువారం నుంచి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయానికి, పక్కనే ఉన్న భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నత్తి దశరథ, ఉపాధ్యక్షులు రామా గౌడ్, పంచాయతీ కార్యదర్శి సందీప్ గౌడ్, గ్రామ అధ్యక్షులు వర్కల రమేష్, మైనార్టీ సెల్ కార్యదర్శి ఖైసర్, నాయకులు సారా గోవర్ధన్, రమేష్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీలను మోసం చేసిన సర్కార్



నవతెలంగాణ-జహీరాబాద్

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో మున్సిపాల్టీలో ఉన్న రైతుకూలీలను పరిగణలోకి తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ పట్టణ నాయకులు నామా రవికిరణ్ గుప్తా, మహమ్మదీ యాకుబ్, బండి మోహన్‌లు ఆరోపించారు. గ్రామాల్లో భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించేలా పథకం రూపొందించిన ప్రభుత్వం.. పట్టణంలోని వ్యవసాయ కూలీలను విస్మరించిందని మండిపడ్డారు. కేవలం గ్రామాల్లోని వ్యవసాయ కూలీలను మాత్రమే ఈ పథకానికి అర్హులుగా గుర్తించడం మోసం చేయడమే అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 129 మున్సిపాల్టీల్లో 8 లక్షల మందికి పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారని, కూలీలు ఎక్కడున్నా కూలీలేనని, పట్టణాల్లో మున్సిపాలిటీలో ఉన్న రైతు కూలీలను కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో తీసుకురావాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ మున్సిపాల్టీలో విలీన గ్రామాలైన రంజోల్, పస్తాపూర్, అల్లిపూర్, చిన్న హైదరాబాద్ గ్రామాల్లో 1280 మంది కూలీలు ఉపాధి హామీ కింద పని చేశారన్నారు. ఇప్పుడు కూడా వారు ప్రతిరోజు వ్యవసాయ కూలీలుగా పని చేస్తున్నారన్నారు. పాత జహీరాబాద్ మున్సిపాల్టీ పరిధిలో వివిధ వార్డుల్లో నివాసముండే సుమారు 1500 మంది వరకు భూమిలేని కూలీలు ప్రతిరోజు పట్టణానికి ఆనుకొని ఉన్న వ్యవసాయ భూములో కూలీలుగా పనిచేస్తు న్నారన్నారు. వారందరికీ కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా, నాయకులు సత్యం ముదిరాజ్, వెంకటేశం గుప్తా, టేక్మాల్ గణేష్, నరసింహారెడ్డి, కళ్లెం చంద్రయ్య , చిన్నమర్రి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్గిలో ఘనంగా బోనాల జాతర

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండలంలోని మల్గి గ్రామంలో ఉరడమ్మ లక్ష్మీమాత బీరప్ప బోనాల జాతర సోమవారం ఘనంగా జరిగింది. గ్రామస్తుల ఆధ్వర్యం లో పురవీధుల గుండా పోతురాజుల విన్యాసాలతో జాతర వైభవంగా కొనసాగుతుంది. మహిళలు గ్రామదేవతలకు బోనాల ఊరేగింపుతో నైవేద్యం సమర్పించి యజ్ఞపూజలు చేశారు. ఈ వేడుకలో తాజా మాజీ సర్పంచ్ జె.మారుతి, గ్రామ భక్తులు భూమారెడ్డి, శివ నంద, సిద్ధారెడ్డి, విట్టల్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు సేవా దృక్పథంతో ఉమ నరసింహారావు రూ.11,000 విలువైన మైక్‌సెట్‌ను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. పాఠశాల కోసం సేవా కార్యక్రమాలకు చేయడం పట్ల పలువురు గ్రామస్తులు అభినం దించారు. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు చేయూతనిస్తే పాఠశాల అభివృద్ధి పథంలో వెళ్తుందని హెచ్ఎం గురునాథ్ అన్నా రు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, మాజీ ఎంపీటీసీ మల్లిక శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ రామేశ్వరి బసయ్య స్వామి, గ్రామస్తులు తిరుపతి రెడ్డి, సిరాజోద్దీన్, మైముద్ అల్లి, ఉపాధ్యా యుల వెంకటరెడ్డి, జైసింగ్, సంగమేశ్వర్, విద్యార్థులు యువకులు ఉన్నారు.

ఎల్ఐసి సంక్షేమానికి శ్రీనాథ్ శర్మ కృషి అభినందనీయం

నవతెలంగాణ-జహీరాబాద్



జహీరాబాద్ పట్టణంలోని ఎల్ఐసి ఆఫీస్‌లో ఏ సమస్య వచ్చిన దాని పరిష్కరించేందుకు డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనాథ్ శర్మ చేసిన కృషి అభినందనీయం అని ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టల్ గౌడ్ అన్నారు. జహీరాబాద్ ఎల్ఐసి ఆఫీసులో శ్రీనాథ్ శర్మ ఉద్యోగ విరమణ సన్మాన సభను సోమవారం ఏర్పాటు చేశారు. జహీరాబాద్, నారాయణఖేడ్ డి ఆఫీస్ సంఘం తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్య దర్శి ట్రెజరర్ పి.ప్రవీణ్, డివిజనల్ నాయకులు కిష్టన్న, మాధవ రావు, వెంకటేష్, రాజకుమార్, అంజయ్య, మోహన్ రెడ్డి, చంద్రారెడ్డి, నసీరుద్దిన్, విట్టల్, లక్ష్మి, అశోక్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులున్నారు.

నవతెలంగాణ
3
మెదక్
మంగళవారం | 28 జనవరి 2025 | www.navatelangana.com

సీపీఎస్ రద్దు చేయాలని తహశీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-తూప్రాన్



సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేయాలని పీఆర్టీయూ తూప్రాన్ మండల అధ్యక్షులు గంగాల రమేష్ ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎస్.విజయలక్ష్మికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను పూర్తిగా రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 1 ఏప్రిల్ 2025 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయడానికి సిద్ధపడి, రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయం కోరిన సందర్భంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ తీవ్ర నిరసనను తెలియచేస్తూ, సోమవారం పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి యూపీఎస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ప్రధాన కార్యదర్శి సంగిడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మెదక్ కలెక్టరేట్లో ప్రజావాణి

నవతెలంగాణ-మెదక్



అదనపు కలెక్టర్ నగేష్ సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను వ్యక్తిగతంగా తెలుసుకుని, వారి నుంచి తీసుకున్న 82 దరఖాస్తుల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తూ, వారి సమస్యలను పరిశీలించి, పరిష్కార మార్గాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, డీఆర్డీఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

28న టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం

నవతెలంగాణ-మెదక్



టీఎన్జీవో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 28వ తేదిన నిర్వహించనున్నట్లు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రత్యేక అతిథులుగా పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు, నర్సాపూర్ శాసనసభ్యులు సునీత రెడ్డి, శాసన మండలి సభ్యులు సేరి సుభాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో పాటు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హుసేని రాష్ట్ర మాజీ అధ్యక్షులు దేవి ప్రసాద్‌లు హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

నవతెలంగాణ-చేగుంట



మండలంలోని పెద్ద శివనూర్, చిన్న శివనూర్ గ్రామాలలో ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం మధ్యాహ్న భోజనంను దుబ్బాక యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ హుస్సేముద్దీన్, మండల అధ్యక్షులు నవీన్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారంగా భోజనాలు అందిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకంలో వాడే నిత్యావసర సరుకులను సైతం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అధ్యక్షులు అన్నమంజనేయులు, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బోయిని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ స్కీమ్‌కు పీఆర్టీయూ వ్యతిరేకం

నవతెలంగాణ-హవేలీఘనపూర్

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను పీఆర్టీయూ వ్యతిరేకమని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కు డిమాండ్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి 1980 రివైజ్డ్ పెన్షన్ రూల్స్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఏకీకృత పెన్షన్ స్కీంను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నరేం దర్ రెడ్డి, నాయకులు సంతోష్ కుమార్, మల్లారెడ్డి, సంగమేశ్వర్, రాజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదివిన బడిని మరవద్దు

- వైద్య శాస్త్రవేత్త మన్నె ఉపేందర్

నవతెలంగాణ-పాపన్నపేట



చదివిన బడిని మరవద్దని వైద్య శాస్త్రవేత్త మన్నే ఉపేందర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో తన సొంత నిధుల తో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తన సతీమణి వందనతో కలిసి ప్రారంభించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంపాదించుకున్న ఆస్తుల్లో ఎంతో కొంత సమాజ సేవకు వినియోగించాలన్నారు. తనకంటే ధనవం తులు ఎంతోమంది ఉన్నారని తమతోపాటు వారు కూడా సేవ చేస్తే సమాజానికి ఎంతో లబ్ధి చేకురుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఎవరు పూలబాటపై ప్రయాణించరని, ఎంతటి వారైనా కష్టసుఖాలను ఎదుర్కోవాల్సిందేనన్నారు. తాను ఒబామా వైద్య సలహాదారుగా పనిచేశానంటే దాని వెనుక ఎంతో కష్టం ఉందన్నారు. తాను ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, విద్యార్థులు వివిధ రకాలుగా వినియోగించుకోవడానికి ఏర్పాటు చేశానని, కేవలం పత్రికలు పుస్తకాలు చదవడమే కాకుండా సైన్స్ పరంగా తాను తన మిత్రులతో కలిసి అమెరికా నుంచి విద్యార్థులకు సైన్స్ క్లాసులు తీసుకోవాలన్న యోచనతో స్క్రీన్ ఏర్పాటు చేశానన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఆయన రూ.రెండు లక్షల వ్యయంతో లైబ్రరీ ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు, స్థానికులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, పాఠశాల చైర్మన్ భవాని, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, విశ్రాంత మండల విద్యాధికారి మోహన్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బచ్చు రాజు పల్లి, జెడ్చెరువు, గ్రామాలను నందిగామ సొసైటీలో కలపాలి



నవతెలంగాణ-నిజాంపేట: బచ్చురాజుపల్లి, జెడ్చెరువు తాండ రెండు గ్రామ పంచాయతీలు నందిగామ సొసైటీలో కలపాలని గ్రామాలకు చెందిన రైతులు సోమవారం మెదక్ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రెండు ఆమ్లెట్ గ్రామాలు నందిగామ ఎంపీటీసీని ఎన్నుకోవడం జరుగుతుందని, నందిగామ సొసైటీలో విలీనం చేసినట్లయితే రెండు గ్రామాల రైతులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఎరువు బస్తాలకు సబ్సిడీ విత్తనాలకు రామాయంపేట వెళ్లి తీసుకురావాలంటే నానా ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడి రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని రామాయంపేట సొసైటీలో నుంచి తమ గ్రామాలను తొలగించి నందిగామ సొసైటీలో కలిపి నందిగామ సొసైటీని పునరుద్ధరించాలని కోరారు. బచ్చు రాజు పల్లి జడ్చెరువు తండ గ్రామాలు నందిగామ ప్రాథమిక సహకార సంఘంలో కలపాలని, వేరే గ్రామంలో కలిపితే తమకు చాలా దూరం అవుతుందని వారు తెలిపారు. తమ గ్రామాలు నందిగామ పిఎసిఎస్ లో కలిపినట్లయితే రైతులకు సౌకర్యంగా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు రాజు పల్లి పిఎసిఎస్ డైరెక్టర్ రమావతు లక్ష్మి, బచ్చు రాజు పల్లి మాజీ సర్పంచ్ గాజులపల్లి నరసవ్వ, నరేందర్ నాయక్, రాజు నాయక్ ,అరుణ్ నాయక్, బాల్య, రాంజీ, జగన్, సంగ్య, రాజు నాయక్, ధనరాజ్ నాయక్, బాబు నాయక్, భాస్కర్ నాయక్, నర్సింలు, బాబు, రాజు పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకమండలి సేవలు అమోఘం

నవతెలంగాణ-నర్సాపూర్



నర్సాపూర్ మున్సిపల్ పాలక వర్గ సేవలు అమోఘమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు సోమవారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణమండపంలో నర్సాపూర్ మున్సిపల్ పాలకవర్గం పదవి విరమణ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునితారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ మనం చేసే సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయన్నారు. నర్సాపూర్ మున్సిపల్ పాలక వర్గం పట్టణాభివృద్ధికి ఎంతో కృషి చేసిందని కొనియాడారు. ఓ ఆర్ ఆర్ నుంచి మెదక్ వరకు 765 డి రోడ్డును నాలుగు లైన్లతో డివైడర్లు ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాక నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి మరొక అంబులెన్స్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అమృత టు పథకంలో భాగంగా నర్సాపూర్ కు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం పదవి ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉండి సేవలు అందించాలని గుర్తు చేశారు. నర్సాపూర్ అభివృద్ధికి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎఫ్డిఎస్ నిధుల కింద రూ.40 కోట్లు మంజూరు చేసిందన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా ఉండి నర్సాపూర్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ , కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ మధుసూదన్, మల్లేష్ గౌడ్, రమేష్ గౌడ్ సత్యం గౌడ్ రమేష్ యాదవ్ రమేష్ యాదవ్, అంజి గౌడ్, కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నహీముద్దీన్, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలు పటిష్టంగా నిర్వహించాలి

నవతెలంగాణ-మెదక్



ఇంటర్ ప్రయోగ పరీక్షలు పటిష్ట ప్రణాళిక ద్వారా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నందు అదనపు కలెక్టర్ నగేష్, ఇంటర్మీడియట్, అధికారి మాధవి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, సంబంధిత అధికారులుతో కలిసి జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు నిర్వహించడంపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఇంటర్మీడియేట్ బోర్డు ఆదేశాల మేరకు 2024-25 విద్యా సంవత్సరమునకుగాను ఫిబ్రవరి 3 నుంచి జిల్లాలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభించబడుతాయని, నాలుగు విడుతల్లో జరిగే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6,660 మంది ప్రథమ సం,, 6418 మంది ద్వితీయ సం,, విద్యార్థులు మొత్తం 12484 మంది ప్రయోగ పరీక్షకు హాజరు కానున్నారు. ఈ సారి ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు నుంచి పర్యవేక్షించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. రెవెన్యూ, పోలీస్ విద్యుత్, ఆర్టీసీ, విద్య, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేస్తూ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా నిర్వహిస్తున్నందున విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.















































నవతెలంగాణ
సిద్దిపేట
మంగళవారం | 28 జనవరి 2025 | www.navatelangana.com

ప్రోటోకాల్ ఉల్లంఘనపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నవతెలంగాణ -నంగునూరు

జనవరి 26 న ప్రజా పాలనలో భాగంగా అధికారిక కార్యక్రమంలో ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ నేతలు పాల్గొనడం ప్రోటోకాల్ ఉల్లంఘన అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. సోమవారం ప్రోటోకాల్ ఉల్లంఘనపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుల బృందం గుండు భూపేశ్, జాప శ్రీకాంత్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డిలు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో జరిగిన అధికారిక పథకాల ప్రారంభోత్సవంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి, తహసీల్దార్ జి.సరిత లు ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజల హరికృష్ణ, ఇతర మండల నాయకులను వేదిక మీదకు పిలిచి సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను ఇప్పించడం ప్రోటోకాల్ ఉల్లంఘనే అని అన్నారు. ఎలా అధికారులు వారిని పిలిచి ఇప్పిస్తారని ప్రశ్నించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు రమేశ్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరణ

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్/ సిద్దిపేట

సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ని సోమవారం కలెక్టర్ ఎం.మనుచౌదరి, ఏవో అబ్దుల్ రెహమాన్ ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పొన్నమళ్ళ యాదగిరి,రాష్ట్ర జేఏసీ చైర్మెన్ పులగుర్ల రాజిరెడ్డి,స్టేట్ కన్వీనర్ రేణుక, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజమల్లు, డివిజన్ అధ్యక్షులు పోతుల నర్సిములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



30న పుస్తకావిష్కరణ సభ

నవతెలంగాణ-సిద్దిపేట



కొండి మల్లారెడ్డి రచించిన కవితాసంపుటి గూడుచెదిరిదృశ్యంను జనవరి 30న సాయంత్రం 5 గంటలకు సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరుగుతుందనీ తెలంగాణ రచయితల వేదిక సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మహమూద్ పాషా తెలిపారు. సోమవారం ఆవిష్కరణ కరపత్రాన్ని ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనమండలి సభ్యులు, ఉద్యమనేత, ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారనీ తెలిపారు. కవులు, రచయితలు, సాహిత్యాభిలాషులు, ఉద్యమకారులు, అధికసంఖ్యలోపాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు పర్కపెల్లియాదగిరి, అశోకరాజు, నరసింహారెడ్డి, మహిపాల్, పెద్దిరాజు, సూకూరిప్రవీణ్, స్వామి, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండలం పరిధిలోని పీర్లపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిలుగా ఎమ్‌జేఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రామస్వామి ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పోసాన్ పల్లి రాజు హాజరై మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల ప్రజా ప్రయోజనాల కోసం పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించిన సంఘము అని గుర్తు చేశారు. ఏబీసీడీ వర్గీకరణ అమలు జరిగితే మాదిగలతో మాదిగ ఉపకులకు న్యాయం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మచ్చ గణేష్, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బాలకృష్ణ, కరుణాకర్, కార్యదర్శులు మల్లేశం, కోశాధికారి బాబు, ప్రచారం కార్యదర్శి పైసా స్వామి, పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని సెక్యూరిటీ గార్డ్ మృతి



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం రాంపల్లి శివారులో సోమవారం మోటార్ సైకిల్‌ను వ్యాన్ ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాలు.. రాంపల్లి గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి (35) టోల్ ప్లాజాలో సెక్యూరిటీ గార్డ్ గా పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని గ్రామానికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా రాంపల్లి శివారులో వ్యాన్ ఢీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన ఆయన అక్కడికక్కడ మృతి చెందాడు.

జాతీయ రోడ్డు సైక్లింగ్ గేమ్స్‌కు స్నేహ ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

38వ జాతీయ స్థాయి ఉమెన్స్ రోడ్ సైకిల్ గేమ్స్‌కు సిద్దిపేట ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న కే స్నేహ ఎంపికైనట్లు శిక్షకులు సంజీవ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఉత్తరాఖండ్ లో జరగబోయే పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇక్కడ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న వారికి లేటెస్ట్ ఎక్విప్మెంట్స్ ఉంటే జాతీయస్థాయిలో పథకాలు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నాయని, దాతలు ఎవరైనా ఉంటే సహకరించాలని ఆయన కోరారు. స్నేహను రాష్ట్ర సైకిల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, విజయ కాంతారావు, మల్లారెడ్డి, దత్తాత్రేయ, విజయ భాస్కర్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకట నరసయ్య, తదితరులు అభినందించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడగింపు

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఓపెన్ స్కూల్లో పది ,ఇంటర్ అడ్మిషన్లకు తత్కాల్ స్కీం కింద ఈనెల 29 వరకు చివరి గడువు పొడగించినట్లు ఎంఈఓ వరదరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యపై మక్కువ ఉన్నటువంటి వాళ్ళు బడి మధ్యలో మానేసినటువంటి వాళ్ళు ఉద్యోగ ప్రమోషన్లకు గృహిణులకు మంచి అవకాశం అని తెలిపారు. మూడు నెలల్లో 10వ తరగతి ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునేటువంటి అవకాశం ఓపెన్ స్కూల్ సొసైటీ కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి చంద్రభానును ఈ నంబర్లను సంప్రదించగలరు. 9948250886,9573101312

బిస్మాట్ స్టేట్ జనరల్ సెక్రెటరీకి అభినందన

నవతెలంగాణ-సిద్దిపేట



జిల్లా కేంద్రంలోని చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ సునయన ఆధ్వర్యంలో ఇటీవల బి స్మాట్(బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ) స్టేట్ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన జగ్గు మల్లారెడ్డినీ చైతన్య పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందన సమావేశం ఏర్పాటు చేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకాన్ని ఉంచి, స్టేట్ జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు రాష్ట్ర కార్యవర్గానికి, సిద్దిపేట జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ప్రభుత్వంతో ప్రైవేట్ పాఠశాలల సమస్యలను దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

29 నుండి ముర్షద్ గడ్డ ఉర్సెషరీఫ్ ఉత్సవాలు

నవతెలంగాణ-సిద్దిపేట



ముర్షద్ గడ్డ 44 వ ఉర్సెషరీఫ్ ఉత్సవాలు ఈనెల 29 నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి ఖాజా మహమ్మద్ హకీం షరీఫ్ చిష్తి తెలిపారు. సోమవారం ఆశ్రమంలో క్యాలండర్, ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలు అని తేడా లేకుండా, సర్వ మతాల సమ్మేళనం నిర్వహించి, ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే భక్తులకు భోజనము, తాగునీరు, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజున పవిత్ర స్నానం, గంగారాధన, ఊరేగింపు, 30న దీపారాధన, 31న కురాన్ పఠనము, వేదాంత హారతితో కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు వేద జ్ఞానామృత ఖవ్వాలి నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు, సాబేర షరీఫ్, అఫ్జల్ ఉద్దీన్, నాయుబ్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను' ఏ' లోకి మార్చాలి

నవతెలంగాణ-గజ్వేల్



ముదిరాజులను బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ బస్సు యాత్ర చేపట్టిన డాక్టర్ శివ ముదిరాజ్ అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణానికి చేరుకున్న బస్సు యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక నష్టాలను సామాజిక వెనుకబడినతనం వాటిని రూపుమాపాలని ఉద్దేశంతోనే బస్సుయాత్ర చేస్తున్నామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గుంటుక శ్రీనివాస్, రొట్టెల శ్రీనివాస్, హేమ సురేష్, గుంటూరు రమేష్, తదితరులు ఉన్నారు.

పల్లాపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

- దాడి చేయడం కాంగ్రెస్ పార్టీ పిరికి చర్య
- జనగామ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి
- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

ప్రజా పాలన లో భాగంగా జనగామ మండలం ఎర్రగుంట తండలో ఆదివారం జరిగిన గ్రామసభలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం, వారి కార్యకర్తలను గాయపరచడం కాంగ్రెస్ పార్టీ పిరికి చర్య అప్రజాస్వామికమని దీనిని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఖండిస్తుందని, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ఏ గ్రామానికి ఆ గ్రామంలో జరగాల్సిన గ్రామ సభలకు ఇతర గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలను తరలించి ప్రతిపక్షాలపై దాడులు చేయించడం వారి చేతకానితనానికి నిదర్శనమన్నా రు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా దాడులు చేయిస్తే ప్రజలు క్షమించరని తగిన బుద్ధి చెప్తారన్నారు. ఇలాంటి ఘటనలకు కారణమవుతున్న కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పై కాంగ్రెస్ నాయకులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పై దాడి జరుగుతుంటే అక్కడే విధులు నిర్వహి స్తున్న జనగామ సీఐ దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోకుండా డ్యాన్సులు చేయించి అధికార పార్టీకి కొమ్ము కాస్తున్న అతని పై చర్యలు తీసుకొని, వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కారం చేయాలని అడిగితే ప్రతిపక్షాలపై దాడులు చేస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ సమావేశం లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెకట మావో, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్ : సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి మొత్తం 117 దరఖాస్తులను తీసుకు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగ రాజమ్మ డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, వివిధ శాఖల జిల్లా అధికారు లు పాల్గొన్నారు.



సీపీఎస్ అంతం పీఆర్టీయూ పంతం













నవతెలంగాణ-మద్దూరు: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం యూపీఎస్ పథకాన్ని వ్యతిరేకిస్తూ ఓపీఎస్ వర్తింపజేయాలని కోరుతూ మద్దూరు మండల పీఆర్టీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా పీఆర్టీయూ నాయకులు మాట్లాడుతూ టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు యూపీఎస్ పథకాన్ని వ్యతిరేకిస్తూ, మేనిఫెస్టో ప్రకారం తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపీఎస్ వర్తింపజేయాలని మధ్యాహ్నం భోజన సమయంలో మద్దూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిం చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మండల అధ్యక్షులు కామిడి శ్రీనివాస్ రెడ్డి,కార్యదర్శి కరుణాకర్, సర్వర్, నాగేందర్, ఇంతియాజ్, స్లీవా రెడ్డి, రవికుమార్, రామకృష్ణ, కార్తీక్, అంజయ్య,ఐలయ్య,మల్లికార్జున్, రజిత, రుమాన తబసుమ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమ లు చేయాలని పీఆర్టీయు నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూపీఎస్ పథకానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ నంగునూరు మండల తహసీల్దార్‌కు సోమవారం మధ్యాహ్నం భోజన సమయంలో మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా నంగునూరు మండల పీఆర్టీయూ అధ్యక్షుడు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి రామ స్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొత్తపల్లి రవి, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యుపిఎస్ విధానాన్ని అమలు చేయవద్దని కోరారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

గజ్వేల్ : సోమవారం భోజన విరామ సమయంలో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ రాష్ట్ర సంఘ పిలుపుమేరకు స్థానిక ఆర్డీఓ చంద్రకళ కు గజ్వేల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వంటేరు సత్యనారాయణరెడ్డి, తీగుళ్ల లింగం గౌడ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్స్ స్కీమ్‌కి బదులుగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ని ఎంచుకోవాలని మెమోరాం డం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యద ర్శులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కి బదులుగా ఓల్డ్ పెన్షన్ స్కీంని ఎంచుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. పదవీ విరమణ అనంతరం పెన్షన్ భద్రత ఏమాత్రం లేకపోవడం వలన పాత పెన్షన్ మాత్రమే ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ భద్రత ను కల్పిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు యు శ్రీనివాస్, ఎండి బషీరుద్దీన్, పి. శివశంకర్ వి వేమారెడ్డి, టి.బాలు చరణ్ కె నరసింహారెడ్డి కే. శేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.యాదగిరి, పి వెంకటేశం గౌడ్, జిల్లా కార్యదర్శి వై నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ములుగు: యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా పీఆర్టీయూ ములుగు మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మెమొ రాండం సమర్పణ కేంద్ర ప్రభుత్వం సీపీఎస్‌కు బదులుగా ప్రవేశపెట్టిన యునైటెడ్ పెన్షన్ స్కీమ్ యూపీఎస్ (గెజిట్ విడుదల చేసింది)వ్యతిరేకిస్తూ సోమవారం భోజన విరామ సమయంలో రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో తెలం గాణ ప్రభుత్వం యూపీఎస్‌లో చేరొద్దని ప్రభుత్వం మేని ఫెస్టోలో పెట్టిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఓపీఎస్ ఇవ్వాలని పీఆర్టీయూ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు వినతి పత్రం ఎమ్మార్వో ములుగు కార్యాలయంలో ఇవ్వడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ములుగు మండల అధ్యక్షు లు పూడూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బద్దం మనోహర్ రెడ్డి, మరియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, జొన్న శ్రీనివాస్ రెడ్డి,రామ్ నర్సయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, రాష్ట్ర సెక్రటరీ శ్రీనివాస్ చారి, పాల్గొన్నారు.

వర్గల్ : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ వర్గల్ మండల శాఖ ఆధ్వర్యంలో సమస్యల సేకర ణ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వర్గల్, గౌరారం, తునికి ఖల్సా, మీనాజీ పేట్, అంబర్ పేట్, శాఖారం, వేలూరు, నాచారం ,అంతగిరి పల్లి, దండు పల్లి, బొర్ర గూడెం,మజీద్ పల్లి, నెంటూర్, తదితర పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు తిరుప తి రెడ్డి,రాజులు,జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు నరేందర్ మాట్లాడుతూ, సీపీఎస్‌ను రద్దు చేయాలనీ ఒకవైపు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను తీసుకరావడాన్ని ఖండిస్తూ, వెంటనే పాత పెన్షన్ ను పునరుద్దరించాలని డిమాండ్ చేసారు. జిల్లా కార్యదర్శి జల్లెల శ్రీనివాస్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పర్వతం నర్సయ్య, పిల్లి రాములు, నాయకులు సత్తయ్య, రాజ నర్సింహా,మల్లేశం కృష్ణ, పాల్గొన్నారు.

దౌల్తాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోతున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పాత పెన్షన్ విధానమే తిరిగి అమలు చేయాలని పీఆర్టీయూ దౌల్తాబాద్ మండల అధ్యక్షు లు మురికి రాజిరెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యం లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానమును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానం అమలయ్యే దాకా పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసి యేట్ అధ్యక్షులు ఎన్.కిషన్ రెడ్డి, ఆర్.భూపతి రెడ్డి, వై.గోపాల్ రెడ్డి, పి.బాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. రాజయ్య, త్యాగరాజు, మండల అసోసియేట్ అధ్యక్షులు వి .రామకృష్ణా రెడ్డి,ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-సిద్దిపేట



సిద్దిపేట వాసవి క్లబ్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని, ఆర్య వైశ్యులు సేవతో పాటు రాజకీయంగా ఎదగాలని సినీ నటుడు ఆర్యవైశ్య మహాసభ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ నాయకులు పసుపు నూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వైశ్య భవన్ లో వాసవి క్లబ్, వాసవి క్లబ్ వనిత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం వైశ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ కేవలం ఆర్య వైశ్యులు మాత్రమే సభ్యులుగా ఉండి, అన్ని వర్గాల ప్రజలకు, కుల, మతాలకు అతీతంగా సేవ చేయడం క్లబ్ ఉద్దేశం అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షులు గంప శ్రీనివాస్, డిస్టిక్ గవర్నర్ ఇరుకుల ప్రదీప్ కుమార్ మాట్లాడారు. అనంతరం వాసవి క్లబ్ అధ్యక్షులుగా మురం శెట్టి కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిగుళ్ల పల్లి సత్యనారాయణ, కోశాధికారిగా బెజగం రమేష్, పీఆర్ఓగా మర్యాల వీరేశం, వనిత క్లబ్ అధ్యక్షులుగా చిగుళ్లపల్లి మంజుల, ప్రధాన కార్యదర్శిగా బెజగం రూప, కోశాధికారిగా చిగుళ్లపల్లి ధనలక్ష్మి, పి ఆర్ ఓ గా ఆమెటి స్వప్న లను ప్రమాణ స్వీకారం చేయించారు. మిగతా కార్యవర్గాన్ని వాసవి క్లబ్ వైస్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి,రీజియన్ చైర్మెన్ పుల్లూరి శశాంక్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు చందా శ్రీధర్, కోర్తివాడ రాజేందర్, గవర్నర్ 2 మహంకాళి నవీన్, క్యాబినెట్ సెక్రటరీ వనం నరేందర్, క్యాబినెట్ కోశాధికారి సోమ వనజ, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ కొంగరి నారాయణ ఆశయ సాధనకై పోరాడుదాం

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో




నవతెలంగాణ-చేర్యాల

స్వాతంత్ర సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కొంగరి నారాయణ ఆశయ సాధన కోసం ముస్త్యాల గ్రామ కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం అంకిత భావంతో పోరాడాలని సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. కామ్రేడ్ కొంగరి నారాయణ 18వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల పరిధిలోని ముస్త్యాల గ్రామ సీపీఐ(ఎం) శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణకు విముక్తి జరగాలని, రజాకార్ల దుర్మార్గాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని నాటి ఎర్ర జెండా ఆంధ్ర మహాసభ కర్తవ్యాన్ని నిర్వర్తించిన కామ్రేడ్ కొంగరి నారాయణ త్యాగం వెలకట్ట లేనిదన్నారు. వేలాది ఎకరాల భూములను పేదలకు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు, వృత్తిదారులకు దక్కే విధంగా నాటి ప్రజలను చైతన్య పర్చి ఏకంచేసి బడతలు, ఒడిసెలను, బందూకులను అందించి ఎర్ర జెండా నాయకత్వంలో పేదలు సాధించుకున్న భూములపై నేటి ప్రభుత్వాలు కన్నేసి పరిశ్రమల పేరుతో లాక్కొనే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. నేడు సాగుతున్న ఈ దుర్మార్గమైన వ్యవస్థకు వేతిరేకంగా అందరూ సమానంగా శాంతి, సౌఖ్యాలతో జీవించే విధంగా నారాయణ కోరుకొన్న సమ సమాజ స్థాపన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యుడు రేపాక కుమార్ ,శాఖ కార్యదర్శులు ఎండి ఎజాస్, గుంద్ర రవీందర్,సభ్యులు సభ్యులు కొంగరి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వెలికట్టలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కొండపాక



కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో పీఏసీఎస్ డైరెక్టర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బూరుగుల సురేందర్ రావు ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సిద్దిపేటకు చెందిన ఆధ్యా కంటి ఆసుపత్రి వైద్యులు ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఆదితి ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ వ్యాధులకు సంబంధించిన సమస్యలతో పాటు కంటికి సంబంధించిన వైద్య పరీక్షలను చేసి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ రావు మాట్లాడుతూ వారి అడుగుజాడల్లోనే నడుస్తూ సేవ చేయాలనే దృక్పథంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆద్య ఆసుపత్రి డాక్టర్ మాధవి అదితి ద ఆసుపత్రి డాక్టర్ డాక్టర్ నగేష్ లను సత్కరించే కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొమ్మాట మహేష్ మెరుగు ప్రభాస్ ఉన్నారు.

విద్యార్థి దశలో పది కీలకం

నవతెలంగాణ-కొండపాక



విద్యార్థి దశలో పదో తరగతి ఎంతో కీలకమైందని విద్యార్థులను ఇంటి వద్ద చదవడం కోసం తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరు పల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని ఇంటి వద్ద సెల్ ఫోన్‌లు, టీవీలను చూడనివ్వకుండా చదువుపైనే శ్రద్ధ పెట్టేలా చూడాలని సూచించారు. పాఠశాలకు క్రమం తప్పకుండా పంపిం చాలని అలాగే ప్రత్యేక తరగతులకు ఉదయం, సాయంత్రం ఉండేలా చూడా లన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపే ప్రతాపరుద్ర "సింగరాయ జాతర"

- పటిష్ట భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు
- ఒక్కరోజు జాతరకు లక్షలాదిగా రానున్న భక్తులు





నవతెలంగాణ-కోహెడ

ప్రకృతికి పక్షులు పరవసించి మైమరి చిపోయే సోయాగాల నడుమ, చెట్ల పచ్చని ఆకుల అందాల నడుమ ప్రతాపరుద్రుని సింగరాయ జాతర రేపే బుధవారం జరగనుంది. కోహెడ మండల కేంద్రానికి సమీపంలోని కూరెళ్ళ, తంగళ్ళ పల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామల శివా రులో గల గుట్టల నడి బొడ్డుపై వెలసిన " శ్రీ లక్ష్మి నరసింహా స్వామి జాతర" జరుగుతుంది. జాతర మండలం లోని చుట్టూ నాలుగు గ్రామాలైన కూరెళ్ళ, తంగ ళ్ళపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామాల శివారులలో కేవలం ఉదయం సూర్యోద యం నుండి సాయం త్రం సూర్యుడు అస్తమించే వరకు మాత్రమే జాతర జరుగు తుంది. చీకటి పడిందంటే చూద్దామంటే ఒక్క మనిషి కూడా కనిపించరు. చుట్టూ అత్యంత చెట్ల పొదలు, గుట్టలతో చిమ్మ చీకట్లు కమ్ముకుంటాయి.

సింగరాయ జాతర జరిగే రోజు ..ఈ జాతర ప్రతి యేడు పుశ్య బహుళ అమవాస్య రోజున జరుగు తుంది. ఈ జాతరకు చుట్టూ వరంగల్, కరీంనగర్, మెదక్, సిరిసిల్ల తదితర జిల్లాల నుండే కాక హైదరాబాద్, బీవండి, ముంబాయ్, షోలాపూర్ నుండి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు.

జాతర ప్రత్యేకత.. మోయత ఎమ్మెద వాగు తూర్పు నుండి పశ్చిమ వైపుకు పారుతుంది. వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు గుట్టలపై నుండి రకరకాల చెట్ల వేళ్ళను తాకుతూ పారి వాగులో కలుస్తా యి. ఆ నీటిలో స్నానం ఆచరిస్తే సర్వ రోగాలు పోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. జాతరకు వెళ్ళిన భక్తులు చిక్కుడు, వంకాయ, టమాట తదితర కూరగాయాల తో వంటలు చేసుకుని అక్కడే భోజనాలు చేయడం ఇక్కడి ప్రత్యేకత.

జాతర వివాదం.. శ్రీ లక్ష్మి నరసింహస్వామి జాతర జరిగే స్థల గర్భగుడి మా ఊరి సరిహద్దులో ఉంది అంటే మా ఊరిలో ఉందని కూరెళ్ళ, తంగళ్ళపల్లి గ్రామాల మధ్య వివాదం గత పది ఏండ్లుగా తలెత్తింది. దీంతో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పంచనామాలు, సర్వేలు చేసి పరిష్కరించేందుకు ప్రయత్నించి నప్పటికి జావ్యంగానే మిగిలింది. దీంతో ఈ యేడు కూడ అధికారికం గానే సింగరాయ జాతరను నిర్వహిస్తున్నారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి.. జాతర లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ వాసాల సతీష్, సీఐ కె.శ్రీను, ఎస్సై పుల్ల అభిలాష్ ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుం డా ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు చర్యలు తీసుకుంటున్నారు.

వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

నవతెలంగాణ-కొండపాక: మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పరుశరాములు అనే వ్యక్తిపై దాడి చేసి ఆయన భార్య చీరెను పట్టి చింపిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్ చేసినట్టు సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. గత డిసెంబర్ 24న భూ తగాదాల విషయంలో అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి నర్సింలు, తాళ్లపల్లి చంద్రం అనే ఇద్దరు వ్యక్తులు తన భర్త పరశురాములను తిట్టి కట్టెలతో కొట్టి తన చీరను పట్టి చింపారని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. నిందితలిద్దరిని సోమవారం అరెస్టు చేసే రిమాండ్‌కు పంపినట్టు సీఐ వివరించారు.

మోడెల్ స్కూల్లో రోడ్డు భద్రతపై అవగాహన



నవతెలంగాణ-నంగునూరు

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవా ల సందర్భంగా సోమవారం నంగునూరు మండలం అక్కెనపల్లి మాడల్ స్కూల్లో రాజగోపాల్ పేట ఎస్సై అసీఫ్, సిబ్బందితో కలిసి ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ రోడ్డు నిబంధనలు తెలుసుకోవాలని సూచించారు. మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పకుండా పెట్టుకోవాలని వివరించారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, వాహనం నడిపేటప్పుడు వాహనకు సంబంధించిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్ ,ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుండారం గ్రామానికి చెందిన పరకాల దివ్యజ్యోతి సాయి చరణ్ దంపతు ల కుమారుడు మిహాన్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో సత్యార్జునా గార్డెన్ యందు నిర్వహించగా సోమవా రం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ హజరై కుమారు డిని ఆశీర్వదించారు. మండ ల కాంగ్రెస్ నాయకులు అయన వెంట హాజరయ్యారు.

బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-గజ్వేల్

పెదల,అణగారిన,అట్టడుగు,ఊరికి దూరంగా వెలివాడుల బతుకుల బాగుకొసం కొట్లాడిన ఉద్యమ సూర్యుడు గద్దర్‌ను అవమానపరిచిన బండి సంజయ్ వెంటనే క్షమాపణచెప్పాలని సోమవారం దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణులు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ గద్దర్ ఎప్పుడో పద్మశ్రీ, పద్మ విభూషన్ కంటే ఎక్కువ పెదల గౌరవాన్ని పొంది లక్షలాది బడుగుల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన వ్యక్తి, శక్తి గద్దర్, గద్దర్ గురించి మాట్లాడే అర్హత బండి సంజయ్ కి లేదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పకపోతే, దేశం రాష్ట్రం మొత్తాన పెద్ద ఉద్యమం కదులుతుందన్నారు ఈ కార్యక్రమంలో నవీన్,కనుకయ్య పాల్గొన్నారు.

ఉన్నదాంట్లో సాయం చేయడమే తన లక్ష్యం



-లైన్స్ క్లబ్ రీజనల్ చైర్మెన్ సంతోష్

నవతెలంగాణ-గజ్వేల్

తనకున్న కొద్దిలో పక్క వారు కూడా సాయం చేయాలని తన ఉద్దేశమని లైన్స్ క్లబ్ రీజనల్ చైర్మెన్ గోలి సంతోష గుప్త అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణం లో నిరుపేద వధువు వివాహానికి మానవతా దృక్పథంతో పుస్తే మట్టెల పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి కార్యక్రమాలు తాను చేపడుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఇందులో భాగంగానే తొగుట మండలం తుక్కాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం బర్రెంకల కిష్టవ్వ తన కూతురు వివాహం చేయడానికి ఎంతో ఇబ్బంది పడుతుందని తెలిసి సహకారంగా నిలవాలని వివాహానికి పుస్తె మట్టెలు అందజేయడం జరిగిందన్నారు.

ముస్సిపాలిటీలో 20 వార్డుల్లో గెలుస్తాం..



-కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు

నవతెలంగాణ-గజ్వేల్

పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు నాయకత్వంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో 20 వార్డులను కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతుం దని పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు అన్నారు. సోమవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం పదవి కాలం ముగిసింది అని అయితే ఇక వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టుతామని అన్నారు. త్వరలోనే అన్ని వార్డుల్లో జెండా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుంటామని ఆయన చెప్పారు. కార్యకర్తలు నాయకులు నమ్ముకొని తమ వద్దకు వచ్చిన వారికి న్యాయం చేయాలని కోరారు. గజ్వేల్ మున్సిపల్ చైర్మెన్ గిరిని కాంగ్రెస్ కైవాసం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మామిడి కృష్ణ, బాబా తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండ



-కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

నారాయణరావు పేట గ్రామని కి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు నరేష్ తండ్రి గుండె పోటుతో మరణించడంతో సోమవారం సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి అన్ని విధాలుగా కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. వీరి వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షులు బర్మ రామచంద్రం, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కరుణాకర్ , రాష్ట్ర ఫిషరీస్ చైర్మెన్ గౌటి బాబేష్, గ్రామ శాఖ అధ్యక్షులు బిట్ల శ్రీను, తదితరులున్నారు.

హరికృష్ణకు బండ జాతర ఆహ్వాన పత్రిక అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట


సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 28 నుండి 31 వరకు జరుగుతున్న పుల్లూరు బండ జాతర మహొత్సవం ఆహ్వాన శుభ పత్రికను సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణకి అందించినట్లు పుల్లూరు దేవస్థాన కమిటీ చైర్మెన్ పుల్లూరి కనకయ్య గౌడ్, ఆలయ పూజారి రంగచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా చూడాలని, అధికారులకు సూచించినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధి కోసం మంత్రి కొండా సురేఖతో మాట్లాడి నిధులు మంజూరు కేటాయించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెండ్యాల దేవి రెడ్డి, ఒగ్గ యాదయ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-కొండపాక

మానసిక వికలాంగుల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని మండల లీగల్ అడ్వకేట్ కృష్ణమోహన్ అన్నారు. సోమవారం కొండపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ ఉత్తర్వుల మేరకు ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు అందరితోపాటు మానసిక దివ్యాంగులు కూడా సమాన హక్కులుంటాయని వాటి పరిరక్షణ అందరిపైన ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ ఫణి కిషోర్, పిహెచ్ సి వైద్యులు డాక్టర్ శ్రీధర్, వైద్యురాలు డాక్టర్ రజని, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖేలో భారత్ క్రిడోత్సవ్ 2025 పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-గజ్వేల్

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రిడోత్సవ్ 2025 పేరుతో ఆటల పోటీలు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజిక సమరసత వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆకుల నరేష్ , ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య స్వామి వివేకానంద నేతాజీ చిత్రపటాలకు పూలమాలవేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు శారీరకంగా, మానసికంగా ధృఢమవ్వాలనే నిశ్చయంతో ఏబీవీపీ ఖేలో భారత్ క్రీడోత్సవ్ 2025 తో ప్రతి విద్యార్థి గ్రౌండ్ బాట పట్టే విధంగా విద్యార్థి పరిషత్ ఆలోచిస్తుందన్నారు. చోడో మొబైల్ చలో మైదాన్ నినాదంతో డ్రగ్స్ లేని సమాజం కోసం ఏబీవీపీ క్రీడ ఉత్సవాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవులపల్లి మహేందర్, మహిళా కన్వీనర్ లలితఅఖిల, క్రీడోత్సవ్ కన్వీనర్ కళ్యాణ్, కో కన్వీనర్ గురు, ఉపాధ్యక్షులు నవీన్, సంయుక్త కార్యదర్శి ఆదిత్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-బెజ్జంకి : మండల కేంద్రంలోని ఆదర్శ విద్యాలయంలోని అయా తరగతుల్లో మిగిలి న ఖాళీలను విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోమవారం ప్రధానాచార్యులు సంగీత తెలిపారు.6 లో నూరు,7 నుండి 10వ తరగతి వరకు మిగిలిన ఖాళీ ప్రవేశాలకు ఫిబ్రవరి 28వరకు అన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంగీత తెలిపారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానాచార్యులు సూచించారు.

పట్టణాభివృద్ధిలో మున్సిపల్ పాలక వర్గం కీలకం

- మున్సిపల్ కౌన్సిల్ వీడ్కోలు సభలో ఎమ్మెల్యే పల్లా



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణాభివృద్ధిలో మున్సిపల్ పాలక వర్గం కీలకంగా వ్యవహరించిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. చేర్యాల మున్సిపల్ కౌన్సిల్ వీడ్కోలు సమావేశం సోమవారం పట్టణ కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన చేర్యాల మున్సిపాలిటీని కౌన్సిలర్లు పోటా పోటీగా అభివృద్ధి చేశారని పట్టణ అభివృద్ధిలో 12 మంది అదేవిధంగా వ్యవహరించారన్నారు. పార్టీలకతీతంగా పట్టణాన్ని అభివృద్ధి పరచారని కొనియాడారు. చేర్యాలకు రూ.10 కోట్ల సీడీఎఫ్ నిధులను కేటాయించానని త్వరలోనే వాటిని విడుదల చేయించి 12 వార్డులకు సమానంగా కేటాయించి అభివృద్ధి జరిగేలా కృషి చేస్తానని, కౌన్సిలర్ల పదవీకాలం అయిపోయినప్పటికీ కూడా నూతన పాలకవర్గం ఏర్పడేంతవరకు ఆ వార్డులో ఏ సమస్యలు ఉన్నాయో వారు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చినప్పుడు ఆ సమస్యలను పరిష్కరించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ ను కోరారు. తను ఇప్పటికీ కూడా పార్టీలకు అతీతంగా ఏ గ్రామంలో సమస్య ఉన్న ఆ సమస్యను పరిష్కరించేందుకు నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని, నాయకులు పార్టీలకు అతీతంగా పనులు చేయించుకోవచ్చని సూచించారు.

తమ ఆసుపత్రి ద్వారా నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య సేవలు: ఎమ్మెల్యే

జనగామ నియోజకవర్గ ప్రజలకు తమ సొంత ఆసుపత్రి (నీలిమ) ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నానని, వచ్చే నాలుగేళ్ల కూడా నా నియోజకవర్గ ప్రజలకు అదేవిధంగా 100 శాతం ఉచిత వైద్యం అందిస్తానని, పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజలు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుండి వైద్య సేవల కోసం ప్రజలు తన ఆసుపత్రికి వచ్చారని, వారికి అవసరమైన వైద్యం అందించి, మందులు కూడా ఉచితంగా ఇస్తున్నామని, మేజర్ ఆపరేషన్లు కూడా ఫ్రీగా చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి శ్రీధర్ రెడ్డి, వైస్ చైర్మెన్ నిమ్మ రాజీవ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తాజా మాజీ కౌన్సిలర్‌ను సన్మానించిన మాజీ మంత్రి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

పదవులు ఉంటేనే నాయకులు కారని సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికి సహాయం చేసేవారు నాయకులుగా పిలువబడతారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డు తాజా మాజీ కౌన్సిలర్, మాజీ చైర్మెన్ ఎన్.సి రాజమౌళి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఐదేళ్లుగా ప్రజలకు సేవలు అందించినందుకు కౌన్సిలర్ పంబాల అర్చన శివకుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రగతి నివేదిక డైరీని వారికి బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్ కు దక్కుతుందన్నారు. గ్యారెంటీ లంటూ 60 అబద్ధాలతో రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ ఆగడాల నుంచి విముక్తి కలుగుతుందని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

భవన నిర్మాణంలో భూకంపాలను తట్టుకునే పరిజ్ఞానం

ఎన్ఐటీ పూర్వ డీన్ ప్రొఫెసర్ కట్టా వెంకటరమణ

నవతెలంగాణ-పటాన్‌చెరు

భూకంపాలను తట్టుకునేలా భవనాలను రూపొందించేందుకు అత్యాధునిక పరిజ్ఞానం, వినూత్న పద్ధతులు అందుబాటులో ఉన్నాయని ఎన్ఐటీ సూరత్కల్ మాజీ డీన్ (విద్య) ప్రొఫెసర్ కట్టా వెంకటరమణ చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఇంజనీరింగ్ భూకంప శాస్త్రం - గత భూకంపాల నుంచి నేర్చుకోవడం' అనే అంశంపై సోమవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. భూకంప నిరోధక భవన నిర్మాణ డిజైన్ కోసం బేస్ ఐసోలేషన్ టెక్నిక్, బ్రేసింగ్ సిస్టం వంటి పలు వినూత్న పద్ధతులు ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్నాయ న్నారు. ఎయిర్ బ్యాగ్ విధానంలో, భూకంపం వచ్చినప్పుడు భవనం కొద్దిగా పైకి లేచి, ప్రకంపనలు తగ్గిపోగానే యథాతథ స్థితికి వచ్చే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కూడా అందుబాటులో ఉంద న్నారు. భూకంపాలు సహజంగా టెక్టోనిక్ ప్లేట్లు ఢీకొనడం వల్ల సంభవిస్తాయని, సీస్మోగ్రాఫ్ ద్వారా దాని తీవ్రతను కొలుస్తారని చెప్పా రు. భూకంప సంఘటనలకు వ్యతిరేకంగా భద్రత, స్థితిస్థాప కతను పెంచడానికి అనుగుణంగా నిర్మాణాలను రూపొందించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. స్ట్రక్చరల్ ఇంజనీ రింగ్, నిర్మాణ పద్ధతులు ప్రపంచ వ్యాప్తంగా గణనీయంగా అభివృద్ధి చెందాయని, అయితే అనేక భూకం ప ప్రయోగాలు ఖరీదైనవి కావడంతో, అవి సంభవించి నప్పుడు వివిధ దేశాల నిపుణులు క్షేత్ర ప్రయోగాల ద్వారా నష్టాన్ని అధ్యయనం చేయడమే గాక, డిజైన్ లోపాలను గుర్తించి, మెరుగైన ఇంజనీరింగ్ పద్ధతులను రూపొం దిస్తా రని వివరించారు. కుప్పకూలిపోకుండా ఊగగల, శక్తిని గ్ర హించగల నిర్మాణాలను రూపొందించడం చాలా అవసరమని డాక్టర్ కట్టా స్పష్టీకరించారు. వంగే గుణము, ఉపబ లం సూత్రాలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా, ప్రకృతి శక్తులను తట్టుకునే భవనాలను మనం సృష్టించవచ్చని, అందులో నివాసం ఉండేవారికి తగిన భద్రత కల్పించవచ్చని అన్నారు.కాన్పూర్ ఐఐటీ వెబ్ సైట్, నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఫర్ ఎర్త్ క్వేక్ ఇంజనీరింగ్ (ఎన్ఐసీ ఈఈ) వంటి వాటిని తరచూ సంప్రదించడం ద్వారా పలు ప్రాజె క్టులు, పరిశోధనలు చేపట్టే వీలుందంటూ ప్రొఫెసర్ వెంకటరమణ విద్యార్థులను ప్రోత్సహించారు. వారడిగిన పలు ప్రశ్నలకు జవాబులిచ్చారు.సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ చేపూరి అఖిలేష్ అతిథిని విద్యార్థులకు పరిచయం చేసి, ఆయన విలువైన సమయాన్ని కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



సింగూర్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తాం

మంత్రి దామోదర రాజనర్సింహా



నవతెలంగాణ-చౌటకూర్

సింగూర్ ప్రాజెక్టును అన్ని విధాల అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి సోమవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటకుల సౌలభ్యం కోసం 50 సీట్ల సామర్థ్యంతో నడిచే రెండు అధునాతన బోట్లు, స్పీడ్ బోట్స్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సింగూర్ ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్, రోడ్ మ్యాప్ ను రూపొందించాలని టూరిజం, ఇరిగేషన్, ఆర్అండ్‌బి శాఖల అధికారులను ఆదేశించారు. సింగూరు జలాశయంలో ఉన్న ఐ ల్యాండ్‌లో వాచ్ టవర్ పైన రెస్టారెంట్, ఫుడ్ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, ఆర్ట్ స్కెపింగ్, గార్డెనింగ్‌లను రూపొందించాలన్నారు. సింగూరు ప్రాజెక్టు దిగువ ప్రాంతంలో పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి పర్యాటక శాఖ ఆధ్వర్యం లో 29 ఎకరాల్లో సుమారు రూ.5 కోట్లతో రెస్టారెంట్, 25 ఆధునిక కాటేజీల నిర్మాణం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఫుడ్ కోర్ట్, గార్డెనింగ్, గ్రీనరీ, ల్యాండ్ స్కేపింగ్, పార్కింగ్ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో సింగూరు డ్యాం పైన బీటీ రోడ్డు నిర్మాణం, పర్యాటకుల సౌకర్యం కోసం డ్యాం పైకి వెళ్లడానికి అవసరమైన స్టెప్స్ నిర్మాణం, డ్యాం బండ్ వెంట పార్కు అభివృద్ధి, సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్‌కు అవసరమైన ప్రతిపాదనలను ఫిబ్రవరి మొదటి వారం లోపు రూపొందించాలనిఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు దర్శించేందుకు వచ్చే పర్యాటకుల సౌలభ్యం కోసం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలన్నారు. పెద్దారెడ్డిపేట చౌరస్తా రోడ్డు నుంచి సింగూరు డ్యామ్ వరకు వచ్చే రోడ్డును 4 లేన్ల రహదారులుగా విస్తరణ పనులు, అధునాతన లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పాండు, ఇరిగేషన్ శాఖ అధికారులు జై భీమ్, నాగరాజ్, ఆర్అండ్‌బి ఇంజనీర్లు రవీందర్, జగదీశ్వర్, పర్యాటకశాఖ అధికారులు నటరాజ్, రెవిన్యూ శాఖ అధికా రులు, చౌటకూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరత్, పుల్కల్ మండలాధ్యక్షులు దుర్గరెడ్డి, సింగూర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే దిశగా ఎదగాలి

- డా. బీఎస్ రావు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బీఎస్ రావు

నవతెలంగాణ-సిద్ధిపేట

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, ఉద్యోగం ఇచ్చే దిశగా ఎదగాలని డాక్టర్ బి.ఎస్.రావు ఫౌండేషన్ ఫౌండర్ డాక్టర్ బిఎస్ రావు అన్నారు. సోమవారం పట్టణంలోని యూనివర్సిటీ పీజీ కాలేజ్ (ఉస్మానియా యూనివర్సిటీ)లో డా. బీఎస్ రావు ఫౌండేషన్ ద్వారా కళాశాల లైబ్రరీకి కాంపిటీటివ్ బుక్స్ ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాథ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాలను వినియోగించుకొని కష్టపడి చదవాలన్నారు. అలాగే సమస్య వైపు ఆలోచించొద్దని, ఉన్న వాటితో ముందు చూపుగా వెళ్లి భవిష్యత్తు నిర్మాణం చేసుకోవాలని సూచించారు. బి.ఎస్.రావు త్వరలో కళాశాలకు ఆర్వో ప్లాంట్ ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం కళాశాల ఆధ్వర్యంలో బీఎస్ రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శివకుమార్, సతీష్ కుమార్, శ్రీనివాస్, శంషాద్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు



మహిళలుకు రక్షణగా 15100 టోల్ ఫ్రీ నెంబర్

- చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి
- బుస్సాపూర్ గ్రామంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు
- లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా సెక్రెటరీ స్వాతి రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్,

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రక్షణగా 15100 టోల్ ఫ్రీ నెంబర్ ఫోన్ చేసి సమస్యను చెప్పవచ్చని డిస్టిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ స్వాతి రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని బుస్సాపూర్ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేసే చోట అనేకమంది లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారని, వాటిపై ధైర్యంగా పోరాడాలని సూచించారు. గృహహింస ఎక్కడ జరిగిన కేసు వేయవచ్చని అది క్రిమినల్ కేసుగా నమోదు అవుతుందని అన్నారు.ఎవరికైనా సమస్య ఉంటే వెంటనే డయల్ 100 కు ఫోన్ చేయాలని, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆశ్రయించాలని సూచించారు. సరైన న్యాయ సలహాలు అందిస్తామని 15100 నెంబర్ కు ఫోన్ చేసి కావాల్సిన న్యాయ సలహాలు సూచనలు పొందవచ్చు అన్నారు. ఆడవారికి పూర్తిగా ఆ సేవలు ఉచితమని, వేరే వాళ్లకు మాత్రం నిబంధనలు పాటిస్తూ సలహాలు అందిస్తామన్నారు. రూరల్ సిఐ శ్రీను మాట్లాడుతూ మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు వచ్చి సమాచారం ఇవ్వాలని, అన్నివేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ , ఉపాధ్యాయులు వెంకట్ ,నర్సారెడ్డి,మంజుల, వాణి, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా అబ్దుల్ హమీద్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-దుబ్బాక

జిల్లాలో మున్సిపాలిటీలకు పాలక వర్గాల పదవీకాలం ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపాలి టీలకు స్పెషల్ అధికారిగా నియమింపబ డ్డ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్‌ను దుబ్బాక, గజ్వేల్, చేర్యాల, హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్లు కళ్యాణం రమేష్ కుమార్, గోల్కొండ నర్సయ్య, ఎస్ నాగేందర్, డీ.మల్లికార్జున్ గౌడ్‌లు సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి మొక్కను బహుకరించారు.

చేర్యాల: చేర్యాల మున్సిపల్ పాలక వర్గ పదవి కాలం ఆదివారం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్‌గా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ను ప్రభుత్వం నియమించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎస్.నాగేందర్ స్పెషల్ ఆఫీసర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

గజ్వేల్: మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ఆదివారంతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్ నియామకం చేపట్టింది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ గా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. సోమవారం ఆయన బాధ్యతలు గజ్వేల్ మున్సి పల్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య ఉన్నారు.

డ్రోన్‌తో వ్యవసాయం

- రైతులకు కూలీల ఖర్చు, సమయం ఆదా
- తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో డ్రోన్ శిక్షణ అవగాహన సదస్సు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

ఆధునిక యాంత్రికరణ పద్ధతుల ద్వారా రైతులు వ్యవసాయం సాగు చేయాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ .ఎస్. శ్రీదేవి అన్నారు. సోమవారం సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానంలో డ్రోన్ తో వ్యవసాయంలో వివిధ పద్ధతుల గురించి రైతులకు శిక్షణ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాస్త్రవేత్తలు డీన్ ఆఫ్ అగ్రిల్చరల్, డా. జె. సత్యనారాయణ, డా. ఎన్. రామ్ గోపాల వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయంలో పరికరాలను ఉపయోగించి అధిక దిగుబడులు పొందాలని అన్నారు. అదేవిధంగా రైతులకు కూలీల ఖర్చు సమయం ఆదా అవుతుందని తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ సహాయం ఎక్కువ పాత్ర పోషిస్తుందని దీని ద్వారా రైతులు వరి పొలంలో నేరుగా వేద సాగు, పంట పొలాలపై పిచికారి చేయవచ్చని తెలిపారు. అనంతరం పొలంలో డ్రోన్ సహాయం తో నేరుగా వరి విత్తడం సాగు పై ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాధిక , డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పద్మ, శాస్త్రవేత్తలు శ్రీజయ, విజయ్, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఆర్య వైశ్యదర్శిని యాప్ రాష్ట్రానికి మార్గదర్శకం

- ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీ నాయకులు చీకోటి ప్రవీణ్



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలో 35 వరకు వివిధ వైశ్య సంఘాలు ఉన్నాయని, కానీ వైశ్యుల సంఖ్య మాత్రం తెలవదని ఇక్కడ నాయకులు చెప్తున్నారని, వైశ్యుల మధ్య ఐక్యమత్యం తీసుకురావడానికి, సంఖ్యాబలం తెలుసుకోవడానికి రూపొందించిన సిద్దిపేట ఆర్య వైశ్య దర్శిని మొబైల్ యాప్ మన రాష్ట్ర ఆర్యవైశ్యులకు మార్గదర్శకమని ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీ నాయకులు చీకోటి ప్రవీణ్ అన్నారు. సోమవారం పట్టణంలోనే రైస్ మిల్ అసోసియేషన్ లో కోఆర్డినేటర్ కొత్తకొండ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతనంగా రూపొందించిన సిద్దిపేట ఆర్యవైశ్య దర్శిని మొబైల్ యాప్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ లో ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది చాలా మంచి కార్యక్రమం అని, మన జనాభా ఎంతో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని, యాచించే స్థాయి నుండి శాసించే స్థాయికి ఎదగాలంటే మన మధ్య ఐకమత్యం ఉండాలని అన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కూర నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరం ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని పేర్లు నమోదు చేసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వైశ్య సంఘాల ప్రతినిధులు దాస శ్రీనివాస్, పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో..సామాన్యులు

- ఇటుక బట్టి నిర్వహణపై చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) డిమాండ్
- ఇటుక బట్టి ప్రాంతాన్ని పరిశీలించిన ఎంపీఓ



నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలో యథేచ్ఛగా నిర్వహిస్తున్న ఇటుక బట్టి వల్ల వెలువడే పొగ, బూడిద వల్ల వెదజల్లే కాలుష్య కోరల్లో పరిసర ప్రాంతాల సామాన్య ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారు. సామాన్య ప్రజల ఇబ్బందులను గుర్తించిన సీపీఐ(ఎం) పార్టీ నాయకత్వం యథేచ్ఛగా నిర్వహిస్తున్న ఇటుక బట్టిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ప్రజావా ణిలో సంబంధిత జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. ప్రజావాణి ఫిర్యాదుపై సోమవారం ఎంపీఓ మంజుల, పంచాయతీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి సీపీఐ(ఎం) నాయకులతో ఇటుక బట్టి పరిసర ప్రాంతాలను సందర్శించి కాలుష్యానికి గురవుతున్న సామాన్యుల సమస్యలపై విచారణ చేపట్టారు. విచారణ సందర్శనలో అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఇట్టి బట్టి యాజమా న్యానికి వత్తాసు పలికేల వ్యవహరించారని ఇటుక బట్టిలో పనిచేస్తున్న కార్మికులకు యాజమాన్యం కనీస వసతులు, సౌకర్యాలు కల్పించకుండా శ్రమదోపిడి చేస్తోందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి యాజమాన్యం అక్రమంగా మట్టి నిల్వ చేసిన చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్య దోరణి అవలం భించడం సరైందికాదని నిష్పక్షపా తంగా ఇటుక బట్టి నిర్వహణపై పూర్తిస్థాయి లో విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు చేపట్టాలని. .లేనిపక్షంలో అధికారుల నిర్లక్ష్య దోరణిపై సీపీఐ(ఎం) అధ్వర్యం లో మళ్లీ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని శ్రీనివాస్ అగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ చేపట్టిన ఎంపీఓ మంజులను వివరణ కోరగా ఇటుక బట్టి నిర్వహణ కు యాజమాన్యం తీసుకున్న ప్రభుత్వ అనుమతుల ధృవ పత్రాలు,కార్మికులకు కనీస వసతులు, సౌకర్యాలు, అక్రమంగా నిల్వ చేసిన మట్టి నిల్వలపై పూర్తిగా విచారణ చేపట్టి సంబంధిత అధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

నష్టపరిహారం అందజేయాలని ట్రైయినీ కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-ఝరాసంగం

మండల పరిధిలోని చిలేపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 103,148, 112, 125,126లో సుమారు 36 ఎకరాలకు నిమ్జ్ ప్రాజెక్ట్ కింద నష్టపరి హారం అందజేయాలని ట్రెయినీ కలెక్టర్ మనోజ్, తహసీల్దార్ తిరుమలరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. గతంలో భూసేకరణ సమయంలో సరైన రైతులను గుర్తించకుండా అధికారులు నష్టపరిహారం చెల్లించాలన్నారు. నష్టపరిహారం అందేంత వరకు తాము కబ్జాలను వదిలే ప్రసక్తే లేదని, అసలైన రైతులను గుర్తించి తమకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో మహబూబ్ పాటిల్, శ్రీకాంత్ రెడ్డి, చంద్రయ్య, ఈరన్న, సంగన్న, వెంకటేశం, నరేష్ తదితరులు ఉన్నారు.

బేటి బచావో బేటి పడావో పటిష్టంగా అమలుచేస్తున్నాం




నవతెలంగాణ-మెదక్

బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం జిల్లాలో అర్థవంతంగా అమలవుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశాల్లో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆధ్వర్యంలో మిషన్ శక్తి మహిళా సాధికారిత కేంద్రం బేటి బచావో బేటి పడావో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బేటి బచావో బేటి పడావో పోస్టర్స్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలిక విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని మహిళా సాధికారత దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారిని హైమావతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, డిఇఓ, రాధా కిషన్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మాధవి, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు ,,ఇతర శాఖ ఉద్యోగులు, పాల్గొన్నారు.



అభ్యుదయవాదమే ఆదర్శ దంపతుల లక్ష్యం



నవతెలంగాణ-జహీరాబాద్

అభ్యుదయవాదమే లక్ష్యంగా పేరు ప్రఖ్యాతలు గాంచుతున్న ఆదర్శ దంపతులు డాక్టర్ దంపతులు శివబాబు, కె విజయలక్ష్మిలు.. గత 25ఏండ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలో సీపీఐ(ఎం) అనుబంధ సంఘాల అభివృద్ధి కోసం శాసశక్తుల్లా కృషి చేస్తున్నారు. డాక్టర్ శివబాబు షుగర్ వ్యాధి వైద్య నిపుణుడు కాగా, డాక్టర్ విజయలక్ష్మి మహిళా వైద్య నిపుణురాలు. ప్రగతి నర్సింగ్ హోమ్ పేరిట జహీరాబాద్‌లో వైద్యశాలను ప్రారంభించి అట్టడుగు వర్గాల వారికి అతి తక్కువ ఫీజులతో వైద్య సేవలు అందిస్తున్నారు. అభ్యుదయ వాదులకు ఉచిత సేవలు చేస్తున్న ఆదర్శంగా నిలుస్తున్నారు. విద్యార్థి దశ నుండే సీపీఐ(ఎం) అనుబంధ సంఘాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తూ తమ వైద్య వృత్తిలో కూడా ప్రత్యేకంగా పేరు ప్రఖ్యాతలు గాంచారు. వైద్య వృత్తి తమ నర్సింగ్ హోమ్ నిర్వహించుకుంటూ అదే సమయంలో పార్టీ అనుబంధ సంఘాలను నడిపించేందుకు శాయశక్తుల్లా కృషి చేస్తున్నారు. జహీరాబాద్ పట్టణంలో సీపీఐ(ఎం)కార్యాలయ నిర్మాణం కోసం స్థలం కొలువూరులో కీలక పాత్ర పోషించి.. భవన నిర్మాణానికి కూడా అదే రీతిలో ప్రోత్సహిస్తున్నారు. జహీరాబాద్ మున్సిపాల్టీలో చిత్త ఏరే కార్మికుల చిన్నారులందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి వారికి విద్య అభ్యాసం చేయడం.. మెరుగైన విద్య కోసం వివిధ హాస్టల్లో చేర్పించడం, నిరుపేద విద్యార్థుల చదువుకు సౌకర్యాలను కల్పించారు. అంతేకాకుండా ఆ విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పించేందుకు తమ వైద్యశాలలోనే ప్రత్యేక గదిలో ప్రత్యేక తరగతులను నిర్వహిం చారు. అందులోనే మన లైబ్రరీ ఏర్పాటు చేసి అందరికీ సాహిత్యాన్ని పంచిపెట్టేందుకు వారు చేస్తున్న కృషి నియోజకవ ర్గంలోనే చర్చనీయాంశంగా మారింది. జహీరాబాద్ పట్టణంలో శ్రామిక్ విజ్ఞాన కేంద్రం పేరిట ప్రతి సంవత్సరం పిల్లల పండుగను నిర్వహిస్తూ వివిధ రాష్ట్రాల నుండి విద్యార్థులను సైతం అందులో పాల్గొనేందుకు అన్ని విధాల చర్యలను చేపడు తున్నారు. శ్రామిక విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ నేర్పించడం నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నారు. శ్రామిక విజ్ఞాన కేంద్రంలో వివిధ రంగాల్లో శిక్షణ పొందినటువంటి వారికి విద్య సాంకేతిక పరిజ్ఞానం శాస్త్రీయ దృక్పథం అలవర్చేందుకు వారు చేస్తున్న కృషి అభినందనీయం. ప్రగతి నర్సింగ్ హోమ్ ఆవరణలో నిర్వహిస్తున్న మన లైబ్రరీ నిర్వహణను హైదరాబాద్కు చెందిన ఎస్వీకే బృందం సైతం పరిశీలించారు. అభ్యుదయవాదులు అంటే ఎంత క్రమశిక్షణతో ఎలా కట్టుబడి ఉంటారో ఆ ఆదర్శ దంపతులను చూసి ప్రతి ఒక్కరూ నేర్చుకుంటున్నారు.

నమ్ముకున్న సిద్ధాంతాల అమలు కోసం ఉద్యోగాన్ని వదిలి ఉద్యమంలోకి...

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి రామచందర్

నవతెలంగాణ జహీరాబాద్

తాను నమ్ముకున్న సిద్ధాంతాలను అమలుపరచుతూ సమాజంలో మార్పు కోసం తన వంతు కృషియే పరమావధిగా భావించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి రామచంద్ర తన పర్మినెంట్ ఉద్యోగాన్ని వదిలి ఉద్యమంలోకి వచ్చి గత 25 సంవత్సరాలుగా నిరంతర పోరాటాలు కొనసాగిస్తూ నిడంబరమైన జీవితాన్ని కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కోహిర్ మండలంలోని మాచిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బి రామచంద్ర దిగ్వాల్ గ్రామంలోని గ్లోబల్ పరిశ్రమలో పర్మనెంట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. అదే తరుణంలో ఆయనకు నచ్చిన సిద్ధాంతాలు సిపిఎం పార్టీ అనుబంధ సంఘాలతో ఏర్పడినటువంటి పరిచయంతో 1999లో పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. తదుపరి పార్టీ ఆది నాయకత్వం సూచనలు, సలహాల మేరకు తన పర్మనెంట్ ఉద్యోగానికి రాజీనామా చేసి నమ్ముకున్న సిద్ధాంతాలను అమలుపరిచేందుకు సిపిఎం పార్టీలో వివిధ అనుబంధ సంఘాలలో నాయకత్వం వహించి తనకంటూ ముద్ర వేసుకున్నారు. ఏ పరిశ్రమలోనైతే కార్మికుడిగా విధులు నిర్వహించారో అదే పరిశ్రమలో యూనియన్ అధ్యక్షునిగా ఉండి కార్మికులకు సేవలు అదించడం తనకు తాను నమ్ముకున్న సిద్ధాంతాలు కల్పించిన గౌరవమన్నారు. చుక్క రాములుతోపాటు సిపిఎం పార్టీ ఆది నాయకత్వం చూపుతున్న బాటలో కొనసాగుతూ సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతాంగ పోరాటం కార్మిక పోరాటం వ్యవసాయ కూలీల పోరాటం దళితుల సమస్యలపై పోరాటం అసంఘటితనంగా కార్మికుల పోరాటం వివిధ రకాల సమ్మెలు, బందులలో పాల్గొని రకరకాల పోరాటాలు నిర్వహించి మారుమూల గ్రామంలోని చిన్న సన్న కారు రైతుకు సైతం రామచందర్ అంటే సిపిఎం నాయకుడు ఆయన వద్దకు వెళ్తేనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న దీక్షకు ఎదిగారు. ఇదే అనుబంధంలో స్థానిక సంస్థల ఎన్నికలు అయినటువంటి జహీరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో నాటి మాజీ మంత్రి ఫరిదోద్దీన్ కృషి మేరకు కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీ చేసి పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్‌గా కూడా గెలుపొంది మున్సిపల్ చరిత్రలో ప్రత్యేక గుర్తింపును సాధించుకున్నారు. నాడు ఇరు పార్టీలకు సమాన కౌన్సిలర్లు ఉండగా రాంచందర్ ఎవరి వైపు మొగ్గుచూపితే



వారే చైర్మన్‌గా అయ్యే ఆస్కారం ఉండగా , అలాంటి సమయంలో కూడా పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి పార్టీ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి ఆ పార్టీ అభ్యర్థి మురళి కృష్ణ గౌడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఐదు సంవత్సరాలు విజయవంతంగా కొనసాగేందుకు రాంచందర్ తనకంటూ క్రియాశీల పాత్ర పోషించారు.

రైతు పోరాటాలే అండగా ఉద్యమాలు....

మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న రామచందర్ బూచోవెల్లి గ్రామానికి చెందిన దళితుల భూములను నాటి ఏపీఐఐసీ ప్రభుత్వం భూములను తీసుకొని అందులో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రకటించారు. సాగులో ఉన్నటువంటి రైతులకు అందరికీ నష్టపరిహారం ఇప్పించాలన్న లక్ష్యంతో గల్లీ నుంచి రాష్ట్ర రాజధాని వరకు ఉద్యమాలు పాదయాత్రలు నిర్వహించి రైతులకు నష్టపరిహారం ఇప్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. నాటి ప్రభుత్వం కూడా రామచందర్‌కు గుర్తించే ఎన్నో ప్రలోభాలకు గురిచేసినప్పటికీ ఎక్కడ కూడా తలగ్గొకుండా నమ్ముకున్న సిద్ధాంతాలతో పార్టీ ఆదేశాలను తూ.చ. తప్పకుండా నడుచుకోవడంతో బూచినెల్లి గ్రామంలో ఉన్నటువంటి అన్ని వర్గాలకు చెందిన వేలాది మంది రైతులకు లాభం చేకూరింది. రామచందర్‌ను వేధింపులకు గురి చేసేందుకు రకరకాల కేసులు పెట్టి జైలుకు పంపించినప్పటికీ వెనకడుగు వేయకుండా ఉద్యమాలు చేస్తూ నిరంతర పోరాట యోధునిగా నిలిచారు.

మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమలు చుక్క రాములు అధ్యక్షునిగా గెలిపించడంతోపాటు పరిశ్రమలోని పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు యూనిఫామ్ బోనస్ క్యాంటీన్ సౌకర్యాలను కల్పించిన ఘనత రాంచందర్‌కు దక్కుతుంది పిరమిడ్ పరిశ్రమలో కార్మికులకు ఉండి చుక్క రాములు అధ్యక్షుడిగా ఉంటే గౌరవాధ్యక్షుడిగా రామచందర్ ఉండి ఆ పరిశ్రమలో కార్మికుల సంక్షేమానికి ఎంతో కృషిచేసిన ఘనత ఆయనకే దక్కుతుంది. పరిశ్రమలోపట విధులు నిర్వహిస్తూ సెప్టిక్ ట్యాంకులలో పడి కార్మికుడు మృతి చెందిన సంఘటనలో పరిశ్రమ యజమాన్యంపై పెద్ద ఎత్తున ఉద్యమాన్ని తీసుకువచ్చి కార్మికుని కుటుంబానికి అన్ని విధాల సహాయ పడి రావాల్సిన బెనిఫిట్స్ లన్ని ఇప్పించి తనకంటూ ముద్ర వేసుకున్నారు. రాయికోడ్ మండలంలోని బొరుగులపల్లి డ్యాంలో భూములు కోల్పోయినటువంటి రైతులకు భూములైన ఇవ్వాలి నష్టపరిహారమైన ఇవ్వాలని హైకోర్టు వరకు పోరాటాలు చేసి రైతులకు నష్టపరిహారం ఇప్పించడంలో తనకంటూ ముద్ర వేసుకున్నారు అనంతరం జహీరాబాద్ నియోజకవర్గంలో సిపిఎం అంటే రామచందర్ రామచందర్ అంటే సిపిఎం అనే ముద్రను వేసుకున్నారు పార్టీ అధిష్టానం నిర్వహించినటువంటి పలు పాదయాత్రలు జహీరాబాద్ పరిధిలో విజయవంతంగా నిర్వహించి అధిష్టానం దృష్టిలో కూడా తనకంటూ ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం రామచంద్ర పై సంగారెడ్డి జహీరాబాద్ కోర్టుల్లో కేసులు ఉన్నప్పటికీ వాటన్నింటినీ కూడా పార్టీ అధిష్టానం చొరవతో ఎప్పటికప్పుడు ఎదుర్కొంటు తన జీవితాన్ని ముందుకు కొనసాగిస్తున్నారు.

జహీరాబాద్‌లో మొదటి పార్టీ వివాహం

జహీరాబాద్ నియోజకవర్గంలో పార్టీ ఉద్యమాలు ఉవ్వెత్తున కొనసాగుతున్న తరుణంలో పార్టీ ఆదినాయకత్వం సూచన మేరకు నిరాడంబరంగా పార్టీ వివాహాన్ని చేసుకొని జహీరాబాద్ రాజకీయ నాయకుల్లో తనకంటూ ఒక గుర్తింపును సాధించారు. పార్టీ ఆదేశాలే పరమావధిక భావించే రామచందర్ ఇంకా ఎన్నో ఉద్యమాల్లో అభివృద్ధి చెందాలని... అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం ఆయన కృషి చేస్తూనే ఉండాలని ఆకాంక్షిద్దాం

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-జహీరాబాద్

రంజోల్ గ్రామానికి చెందిన పద్మమ్మకి సీఎంఆర్ఎఫ్ ద్వారా విడుదలైన రూ.20,000 చెక్కును జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్‌తో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీనియర్ నాయకులు సత్యం ముదిరాజ్, నామా రవికిరణ్, పార్టీ జహీరాబాద్ మండలాధ్యక్షులు తట్టు నారాయణ, ప్యాక్స్ చైర్మెన్ మచ్చేందర్, కేతకీ సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మెన్ నర్సింహ గౌడ్, జహీరాబాద్ మండల పార్టీ జనరల్ సెక్రెటరీ మోహన్ రెడ్డి,ఎస్టీ సెల్ అధ్యక్షులు హిరు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు .

చాల్కి ఏఈఓకు ఉత్తమ అవార్డు పురస్కారం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని చాల్కి క్లస్టర్ ఏఈవో సాయికిరణ్ రెడ్డికి ఉత్తమ సేవా అవార్డు లభించింది. జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరు రూపేష్, టీజీఐఐసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లావ్యవసాయ అధికారి శివ కుమార్ చేతుల మీదుగా సాయి కిరణ్ రెడ్డి అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా ఏఈవో మాట్లాడుతూ..8 ఏండ్లుగా రైతులకు విశిష్ట సేవలు అందించిన ఉద్యోగులకు గుర్తింపు వచ్చిందన్నారు. అవార్డు రావడం పట్ల మండల రైతులు, తోటి అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

లింగాయత్ సమాజ్ యువజన కార్యదర్శిగా నరేష్ పాటిల్



నవతెలంగాణ-జహీరాబాద్

సంగారెడ్డిలో జరిగిన వీరశైవ లింగయ్యత్ జిల్లా సమావేశంలో నరేష్ పాటిల్‌ని సంగారెడ్డి జిల్లా యువజన కార్యదరిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సిములు తెలిపారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పార్టీ యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యువజన అధ్యక్షులు మల్లికార్జునకి, కార్యనిర్వాహ అధ్యక్షులు ప్రశాంత్ పాటిల్‌కి, జిల్లా కార్యవర్గనికి ప్రతేక ధన్యవాదాలు తెలిపారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-జోగిపేట

ఈనెల ఒకటో తేదీలోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు.. పాస్‌పుస్తకం వచ్చినా రైతుభరోసా, రైతుబం ధు పథకం కింద దరఖాస్తు పెట్టుకోని రైతులు వెంటనే రైతు భరోసాకి దరఖాస్తులు చేసుకోవాలని అందోల్ మండల వ్యవసాయ అధికారి శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ ఎకౌంటు సేవింగ్ ఖాతా జిరాక్స్, దరఖాస్తు ఫారం నింపి వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈనెల 31లోపు ఇవ్వాలన్నారు. రైతు భరోసా పథకం కింద అకౌంట్ నెంబర్ మార్పులు లేదా వేరే కారణాలతో ఎకౌంట్ నెంబర్లు మార్చాలనుకునే రైతులు కూడా దరఖాస్తు నింపి సమీప వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖా స్తు ఫారం మీద రాసి ఇవ్వాలని కోరారు. మిగతా వివరాల కోసం వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ మన్నె కిరణ్‌కు ఉత్తమ అవార్డు



నవతెలంగాణ-చౌటకూర్

మండల తహసీల్దార్ మన్నె కిరణ్ కుమార్‌కు ఉత్తమ సేవా అవార్డు దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో ఆదివారం జరిగిన అవార్డుల కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరి క్రాంతి చేతుల మీదుగా కిరణ్ కుమార్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కాగా అవార్డు రావడం పట్ల సోమవారం మండల అధికారులు, నాయకులు, గ్రామ ప్రజలు తహసిల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని అవార్డులు అందుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కొనియాడారు.

కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి

- ఈఈకి వినతిపత్రం అందజేసిన అక్కెనపల్లి రైతులు

నవతెలంగాణ-నంగునూరు

రంగనాయకి సాగర్ రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని కోరుతూ నంగునూరు మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన సుమారు యాభై మంది రైతులు సోమవారం ఇరిగేషన్ శాఖ ఈఈ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మరి కొద్ది రోజుల్లో నీటిని విడుదల చేయకపోతే తమ పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి వస్తుందన్నారు. వాగులు, చెక్ డ్యాంలు, బావులు అడుగంటి పోవడంతో తమ పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని, కావున నీటిని విడుదల చేస్తే వాగులకు చెక్ డ్యాం లకు నీరు వచ్చి తమ పంట పొలాలు పారే అవకాశం ఉందన్నారు. ఈఈ గోపాల కృష్ణ, డీఈ చంద్రశేఖర్ లు మాట్లాడుతూ కాల్వ పనులు పూర్తి కాలేదని చెప్పినట్లు తెలిసింది. వాగు లోకి నీరు వచ్చేందుకు ఏర్పాటు చేస్తామని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి తెలియజేశారు. అధికారులు స్పందించి వెంటనే కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు. ఈ విషయంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సైతం స్పందించారని.. వెంటనే ఇరిగేషన్ అధికారులకు ఫోన్ ద్వారా తమ పరిస్థితిని తెలియజేశారన్నారు. ఇరిగేషన్ అధికారులు ఫిబ్రవరి మొదటి వారంలో నీటిని విడుదల చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆయిల్ పామ్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, అక్కెనపల్లి గ్రామ రైతులు తిప్పని నాగేందర్, సుధాకర్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేష్, యాదగిరి పాల్గొన్నారు.



గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కనిపించడం లేదు

- గజ్వేల్ కోస్తారా?.. శాసనసభకు రాజీనామా చేస్తారా?
- గజ్వేల్ లో బీజేపీని బొంద పెడతాం
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన బండారు



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ శాసనసభ నుంచి మూడుసార్లు గెలిచిన కేసీఆర్ ఇప్పటికీ గజ్వేల్లో కల్పించడం లేదని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు అన్నారు. సోమవారం మహతి ఆడిటోరియం సమీపంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను నమ్మి గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేస్తే కనీసం కనిపించడం లేదన్నారు. దయచేసి శాసనసభకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్ ప్రజలు ఏం పాపం చేసుకున్నారో కనిపించని ఎమ్మెల్యేకు ఓట్లు వేస్తున్నారని ఆవేదన చెందారు. గజ్వేల్ నియోజకవర్గంలో మతతత్వాన్ని పోషిస్తున్న బీజేపీని బొంద పెడతామని అన్నారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ల నాయకత్వంలో గజ్వేల్ లో అన్ని ఎన్నికల్లో గెలుపొందుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మొనగారి రాజు, మండల అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు హనుమంత రెడ్డి, బంగారు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకోవడమే నిజమైన మానవత్వం

- ఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్



నవతెలంగాణ-దౌల్తాబాద్

సాటి మనిషి ఆపదలో ఉన్నాడని తెలిస్తే మనకు తోచిన సహాయం చేసి వారికి మనోధైర్యం కల్పించడమే నిజమైన మానవత్వం అంటారని ఎస్ఆర్ ఫౌండే షన్ అధ్యక్షురాలు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి బియ్యం, నిత్యవసర సరుకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన రాయపోల్ సత్తయ్య క్యాన్సర్ వ్యాధితో ఇటీవల మృతి చెందాడు. ఆ కుటుంబం నిరుపేద కావడంతో సమస్యలతో కొట్టుమిట్టా డుతుంది. కాబట్టి ఎస్ఆర్ ఫౌండేషన్ తరపునా వారి కుటుంబానికి సాయం అందజేయడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమం లోసూరంపల్లి ప్రవీణ్, రాయపోల్ శ్రీను, గొడుగు పల్లి మల్లే శం, బాలమల్లయ్య, కనకవ్వ, చంద్రవ్వ, రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడిని ఖండిస్తున్నాం



నవతెలంగాణ-చేర్యాల

జనగామ మండలం ఎర్రకుంట గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ చేర్యాల పట్టణ అధ్యక్షులు ముస్త్యాల నాగేశ్వరరావు, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, పుర్మ వెంకట్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులపై లాటి చార్జి చేయడమేగాక దాడిపై ప్రశ్నించిన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖుని చేయడమేనని అన్నారు. గ్రామసభల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తూ దౌర్జన్యం చేయడం ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే కాంగ్రెస్‌కి బుద్ధి చెప్తారని అన్నారు. ఈ సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బిరెడ్డి ఇన్నారెడ్డి,బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి బుర్రగోని తిరుపతి గౌడ్, నాయకులు యాట యాదగిరి, యాట పెద్ద బిక్షపతి, ఇప్పకాయల భాస్కర్, అవుశెర్ల కిషోర్ పాల్గొన్నారు.

గురుకులంలో ప్రహరీ లేక పలు సమస్యలు





నవతెలంగాణ-మునిపల్లి

మునిపల్లి మండలంలోని లింగంపల్లి వద్ద గురుకుల పాఠశాల మరియు కళాశాలకు ప్రహరీ గోడ లేక అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. కళాశాల మరియు సిబ్బంది నివాస గృహాల మధ్యలో నుండి బొడిశెట్టిపల్లి మరియు లింగంపల్లి గ్రామాలకు దారి ఉండడంతో నిత్యం ఎన్నో వాహనాలు ప్రయాణం చేస్తుంటాయి. దాంతో తరచూ విద్యార్థులకు ప్రమాదాలు అవుతున్నాయని పలు ఆరోపలున్నాయి. ఇటీవల ఓ విద్యార్థి కళాశాలలో లగేజీ పెట్టి.. ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి విగతజీవిగా కనిపించిన విషయం విధితమే. అయితే ప్రహరీ ఉండి.. కాపలాదారు ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చేరిక మరియు నిష్క్రమణల రిజిస్టర్ సజావుగా నిర్వహిం చాలని సూచిస్తున్నారు. ఇకనైనా అధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి కళాశాలకు ప్రహరిగోడ నిర్మించి కాపలాదారుని నియమాకం చేపట్టాలని కోరుతున్నారు.

పాదయాత్ర సాఫీగా కొనసాగాలి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు

కేసీఆర్‌ను కలిసేందుకు మాజీ సర్పంచ్ పాదయాత్ర



డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు వెంకటేశం, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఝరాసంగం

శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆశీస్సులతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావును కలిసేందుకు మేదపల్లి మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పాటిల్, ఆ గ్రామ యువకులు చేపడుతున్న పాదయాత్ర ఏలాంటి లోటుపాట్లు లేకుండా సాఫీగా కొనసాగాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజ లు చేసి పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావును కలిసేందుకు పాదయాత్రగా బయలుదేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేస్తున్నామని చెప్పడం అంత బూటకమన్నారు. ప్రభుత్వానికి నాలుగు సంక్షేమ పథకా లపై సరైన స్పష్టత లేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తమ ప్రభుత్వ హయాంలో అందజేశామ న్నారు. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ ఉద్యోగికి ప్రశంసాపత్రం



నవతెలంగాణ-మెదక్
ప్రతిభావంతమైన సేవలకుగాను మెదక్ మున్సిపల్ ఉద్యోగి ఉమాపతికి 76వ గణతంత్ర దినోత్సవము 2025 సందర్భంగా ప్రశంసా పత్రం అందజేశారు. ఉమాపతి సేవలను గుర్తించి మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ , జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిలు ప్రశంసా పత్రం అందజేశారు.

ఒకే గ్రామంలో ప్రభుత్వ పథకాలు సిగ్గుచేటు



నవతెలంగాణ-శివ్వంపేట
గద్దెనెక్కిన నాటి నుంచి నేటి వరకు మాయమాటలతో ప్రజలను మభ్య పెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒకే గ్రామంలో ప్రభుత్వ పథకాలు అమలు చేయడం సిగ్గుచేటని, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ మండిపడ్డారు. శివ్వంపేట మండలం గూడూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని గ్రామాలలో సంక్షేమ పథకాలు అందించాల్సిన ప్రభుత్వం కేవలం కాలయాపన చేయడానికే, పథకాలన్నిటిలో కోతలు వేయడానికి, నిరుపేదలను మోసం చేయడానికే మండలానికొక గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందియ్యాలని అధికారులను ఆదేశించడం శోచనీయమని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఒకే గ్రామంలో ప్రజలు ఓట్లేస్తే అధికారంలోకి వచ్చారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలను దగా చేయడం కోసమే, పథకాలను ఎగొట్టడం కోసమే ప్రభుత్వం ఎత్తులు వేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేసే వరకు, అన్ని గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలతో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఎంపీడీవో శేషాద్రిని సన్మానించిన కార్యాలయ ఉద్యోగులు



నవతెలంగాణ-తూప్రాన్
మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.శేషాద్రిని ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు మండల కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా తూప్రాన్ మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కే. శేషాద్రి ఉత్తమ జిల్లాలోనే ఉత్తమ ఎంపీడీవోగా ప్రశంసా పత్రం కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఉద్యోగులు ఎంపీడీవో శేషాద్రిని ఘనంగా సన్మానించి శాలువాతో సన్మానించి, సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, డీఎల్పిఓ సిబ్బంది, ఏపీఆర్ మధు, ఏపీవో సంతోష్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సుహాసిని, సిబ్బంది శ్వేత, సవుద్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన డీఎల్పీఓ



నవతెలంగాణ-చిన్న శంకరంపేట
మండలంలోని ఎస్ కొండాపూర్ గ్రామాన్ని డీఎల్పీఓ సురేష్ బాబు సోమవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ రికార్డులన పరిశీలించారు. అనంతరం నర్సరీలో చెట్లు పెంచే విధానాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు సరియైన పౌష్టిక ఆహారం అందిస్తున్నారా లేదా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యోగేశ్వర్, అంగన్వాడీ టీచర్ శారద తదితరులు ఉన్నారు.



యూపీఎస్ వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలి



నవతెలంగాణ-వెల్దుర్తి
కేంద్ర ప్రభుత్వం అమలు పరచాలనుకున్న యూపీఎస్‌ను వెంటనే వెనక్కి తీసుకొని పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం పీఆర్‌టీయూ మాసాయిపేట మండల శాఖ శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, ఆధ్వర్యంలో మాసాయిపేట మండల తహసీల్దార్ జ్ఞానజ్యోతికి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ విధానాన్ని ఏప్రిల్ 1 తేది నుంచి అమలు పరచాలని గెజిట్లు విడుదల చేసిన దృష్ట్యా దీనిని నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం యూపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ మాత్రమే అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు హరిరంజన్ శర్మ, మండల అసోసియేట్ అధ్యక్షులు కనకయ్య, జిల్లా కార్యదర్శులు దయాకర్, రవి, మండల మహిళా కార్యదర్శి బాలమణి, మండల మహిళా ప్రతినిధి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి



నవతెలంగాణ-శివ్వంపేట : గ్రామాలలో పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉండి ప్రభుత్వం నుంచి పంట పెట్టుబడి సహాయం రాని రైతులందరు కూడ రైతు భరోసా సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి లావణ్య అన్నారు. సోమవారం ఆమె శివ్వం పేటలో మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అందించే రైతు భరోసా పథకాన్ని ఘనతంత్ర దినోత్సవం ప్రారంభించ డం జరిగినదని, గతంలో పంట పెట్టుబడి సహాయం అందుకున్న రైతులు రైతు భరోసా కోసం దరఖా స్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, నూతనంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకొని పట్టాదారులుగా నమోదు చేసుకున్న ప్రతి రైతు కూడ రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవా లని, అందుకు రైతు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ జత చేసి గ్రామాలలోని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని ఆమె తెలిపారు. రైతు భరోసా దరఖాస్తు కోసం ఈనెల 30 వరకు రైతువే దికలలో దరఖాస్తు చేసుకోవాలని, ఈ సదావకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-వెల్దుర్తి
ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్నవారికి ఒక వరం లాంటిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ నియోజకవర్గంలో క్యాంప్ కార్యాలయంలో మాసాయిపేట మండలానికి చెందిన మాసాయిపేట, కొప్పులపల్లి, నాగసానిపల్లి, గ్రామాలకు చెందిన పలువురికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను రూ.3,21,000లు లబ్దిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ఆపదలో ఉన్నవారికి ఒక వరంలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో మాసాయిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, యూత్ అధ్యక్షులు కొప్పులపల్లి కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

మంద కృష్ణకు పద్మశ్రీ అవార్డు అరుదైన గౌరవం



నవతెలంగాణ-శివ్వంపేట
బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం గత మూడు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందించే "పద్మశ్రీ " అవార్డును అందించడమంటే అది పీడిత వర్గాలకు దక్కిన అరుదైన గౌరవమని ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ అన్నారు. సోమవారం మంద కృష్ణ మాదిగను జిల్లా ఉపాధ్యక్షులు చెంది ఎల్లం, నరాల లక్ష్మణ్‌తో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అవార్డు అందించడానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జిల్లా కమిటీ తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ఉత్తమ ఎంపీడీవోగా శేషాద్రి



నవతెలంగాణ-తూప్రాన్
మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.శేషాద్రి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకలలో ఉత్తమ ఎంపీడీవోగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపీడీవో కె.శేషాద్రిని అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు జిల్లా ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని, ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సిహెచ్.ఎల్లయ్య, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి, రోహిత్ రావు, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పది, ఇంటర్‌లో విద్యార్థులు వందశాతం పాస్‌కావాలి



నవతెలంగాణ-మెదక్:
జిల్లాలో పదవ తరగతి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు పటిష్ట ప్రణాళిక విధానం అమలు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేసే విధంగా చర్యలు తీసుకో వాలని పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థిని విద్యార్థులు 100% పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు వారి తల్లిదండ్రులకు నమస్కారాలు విద్యార్థులు పాస్ అయ్యేందుకు ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మీడియా ప్రచారం కల్పించి సహకరిం చాలని ఆయన కోరారు. పాఠశాలలు ఇంటర్మీ డియట్ కళాశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశా ను సారం మెదక్ జిల్లాలో పదవ తరగతి ఇంటర్మీ డియట్ 100% ఉత్తీర్ణత సాధించే దిశగా ముందుకు పోతున్నామన్నారు. ఇందుకోసం విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిం చాలని కోరారు. పదవ తరగతి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులను తప్పనిసరిగా పరీక్షల సమయంలో పాఠశాలకు కళాశాలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు గర్వించే విధంగా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించిన మాజీ జడ్పీటీసీ



నవతెలంగాణ-శివ్వంపేట
బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కులు కొంత ఆసరాగా నిలుస్తాయని జిల్లా ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త అన్నారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సహకారంతో మండలంలోని బిజిలీపూర్, మగ్దుంపూర్, బొజ్యతండా, బిక్యతండా, శివ్వంపేట గ్రామాలలోని 10 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా ఆర్థిక, ప్రణాళిక సంఘం సభ్యులు, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ గుప్త మాట్లాడుతూ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స చేయించుకొన్న బాధితులకు ప్రభుత్వం అందించే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు కొంత ఆర్థికంగా ఊరటనిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మగ్దుంపూర్ మాజీ సర్పంచ్ సోము అశోక్, బొజ్యతండా మాజీ సర్పంచ్ రాజు, గ్రామకమిటీ అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, వంజరి కొండల్, బాసంపల్లి పోచగౌడ్ తదితరులు పాల్గొన్నారు

బాలికా విద్యను ప్రోత్సహిస్తాం



నవతెలంగాణ-తూప్రాన్
జిల్లాలో బాలికా విద్యను ప్రోత్సహిస్తామని మెదక్ డీఈవో రాధాకిషన్ సోమవారం పేర్కొన్నారు. మండలంలోని ఇస్లాంపూర్ గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీఈవో రాధాకిషన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాలికలను విద్య వైపు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. ఇస్లాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీడబ్ల్యుఎస్ఎస్-ఎస్, డీవైన్ వరల్డ్ సోషల్ సర్వీస్ సొసైటీ, అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలికా విద్యను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఇస్లాంపూర్ పాఠశాలలో వివిధ గ్రామాల నుంచి కాలినడకన పాఠశాలకు వచ్చి చదువుకునే ఆరుగురు బాలికలకు బై సైకిల్స్ డీఈవో అందించారు. విద్యా రంగంలో సేవలు అందించడంతోపాటు ఇతర రంగాలలో కూడా తమ స్వచ్ఛంద సంస్థ సేవలందించడానికి సిద్ధంగా ఉందని సంస్థ ప్రతినిధులు వెరాజన్ ,ఫ్రాన్సిస్ వినీత్,సమీర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పర్వతి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు సత్యం, ఉపాధ్యాయ బృందం, ఏపీఎల్ చైర్మన్ స్వప్న, పోషకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మెన్‌కు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-తూప్రాన్
తూప్రాన్ పట్టణం గ్రామపంచాయతీ నుంచి నూతన మున్సిపల్‌గా రూపాంతరం చెందిన అనంతరం తూప్రాన్ మున్సిపాలిటీలో ఒకటో వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికై, మున్సిపల్ తొలి చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాజీ చైర్మెన్ బొంది రవీందర్ గౌడ్‌కు మున్సిపల్ ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్‌గా 4 సంవత్సరాల 2 నెలల పదవి కాలంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, మున్సిపాలిటీలోని అన్ని వార్డులను మున్సిపల్ ప్రజలు మెచ్చుకునే స్థాయిలో అభివృద్ధిని చేసి చూపించారని పలువురు కొనియాడారు. కౌన్సిలర్‌గా పదవి కాలం ముగిసినందున వార్డు, మున్సిపల్ ప్రజలు మాజీ చైర్మెన్ బొంది రవీందర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మామిడి వెంకటేష్, బొంది అరుణ వెంకట్ గౌడ్, బైరం ఉమా సత్య లింగం, తలారి మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు సత్తార్, లక్ష్మణ్, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.